ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 29, సెప్టెంబరు 2025



ఒంగోలుకు తలమానికం.. కళారాల ఉత్సవం

- వందల ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం
- డప్పులు, మేళతాళాలతో రాత్రంతా ఊరేగింపు, భక్తుల కోలాహలం

7



ఒంగోలు సాయిబాబా గుడిలో శ్రీ రాఘవ కూచిపూడి నృత్య సంగీత కళానిలయం విద్యార్థుల ప్రదర్శన

జయహే జగజ్జననీ..

జిల్లాలో దేవీశరన్నవరాత్రులు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఏడోరోజైన ఆదివారం వివిధ రూపాల్లో అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి కాత్యాయనీ దేవి అలంకారంలో సింహ వాహనంపై కొలువుదీరారు. వల్లూరులోని వల్లూరమ్మ, కామేపల్లి లోని పోలేరమ్మ మహా చండి అలంకారంలో దర్శనమిచ్చారు. ఇతర ఆలయాల్లో ఎక్కడికక్కడ ప్రత్యేక అలంకారాలు చేశారు.

లోపలి పేజీల్లో..



వల్లూరులో మహాచండి అలంకారంలో వల్లూరమ్మ



మెప్మాలో లెక్కలేనితనం!



- మొన్న బోగస్ గ్రూపుల నుంచి మహిళా మార్ట్ వరకు..
- నేడు టీఎల్ఎఫ్ ఫండ్ నుంచి వరద సొమ్ము వరకు!
- ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న అక్రమాలు
- రూ.కోట్ల అవినీతి బాగోతంపై అధికారుల ఉదాసీనత
- విచారణ పేరుతో కాలయాపనపై పలు అనుమానాలు

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో లెక్కలేనితనం కనిపిస్తోంది. బోగస్ గ్రూప్‌లతో మొదలైన దోపిడీ.. మహిళా మార్ట్‌కు పాకింది. ఆ తర్వాత సమాఖ్యల ద్వారా టౌన్ లెవల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్)లో దాచుకున్న సొమ్ము దోచేశారు. పొదుపు సభ్యుల పిల్లల స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన లెక్కలు మాయమయ్యాయి. మరోవైపు గత ఏడాది విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు వరద బాధితుల సహాయార్థం సేకరించిన సొమ్ములో కొంత మాయమైంది. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. రూ.కోట్లు దోచేశారు. కొందరు ఆర్పీలు, మరికొందరు సీవోలు, సీఎంఎంలు ఇలా ఎవరి స్థాయిలో వారు భారీగా బొక్కేశారు. మెక్కేసిన ఉద్యోగులు ఇప్పుడు 'లెక్క'లేని తనంతో వ్యవహరిస్తుండటంతో దోపిడీ సొమ్ము తేలడం లేదు. కోట్ల రూపాయలు దండుకుని దర్జాగా కొనసాగుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు చూపుతున్న అలసత్వం అనేక అనుమానాలకు తావిస్తోంది.

పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం

రుణాల వ్యవహారంపై బ్యాంకర్ల నుంచి నివేదికలు తీసుకున్నాం. వాటిని మెప్మా మిషన్ డైరెక్టర్‌కు అందజేశాం. అక్రమాలకు పాల్పడిన వారిపై ఆర్ఆర్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటాం. మహిళా మార్ట్‌కు సంబంధించి నెల్లూరు జిల్లాకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలోని బృందం విచారణ చేస్తోంది. మార్ట్ రికార్డులు స్వాధీనం చేసుకుంది. నివేదికలు రాగానే తగు చర్యలు తీసుకుంటాం. ఇతర అంశాలు చోటుచేసుకున్న సమయంలో నేను ఇక్కడ అధికారిగా లేనందున వాటి గురించి చెప్పలేను. అందుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, రికార్డులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- పి.శ్రీహరి, మెప్మా పీడీ



ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ అవినీతికి కేంద్రంగా మారింది. మార్ట్ మొదలైనప్పటి నుంచి బాధ్యతలు చూసే పర్యవేక్షకులు ఎవరికి వారు భారీగానే దోచేశారు. మార్ట్‌లో అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించిన సరుకుల బిల్లులు ఏమయ్యాయో తెలియదు. ఎక్కడ ఎంత సరుకు కొన్నారు? ఏ రోజు ఎంత అమ్మారు.? లాభ నష్టాలపై లెక్కలు మాయమయ్యాయి. దీంతో ఏడాదికే మార్ట్ మూతపడింది. మార్ట్‌లో అవినీతిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించడంతో మెప్మా మిషన్ డైరెక్టర్ భరత్ తేజ్ నెల్లూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణకు అధికారులను నియమించారు. ఒంగోలు వచ్చి విచారణ చేపట్టిన అధికారులు... అవినీతిపై అనుమానాలు వ్యక్తం చేసినట్లు సమచారం. వారు రికార్డులు స్వాధీనం చేసుకుని వారం రోజులు అయినా నేటికీ ఎలాంటి నివేదికలు లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా మార్టులో గోల్‌మాల్ వ్యవహారం వెలుగు చూసిన వెంటనే తమకు అందాల్సిన పాత నిధులు కూడా రాలేదని కొన్ని సమాఖ్యల వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో లెక్కలు తీయగా 'తీగలాగితే డొంక కదిలినట్లు' అనేక అక్రమాలు బయటపడుతున్నాయి.

స్కాలర్‌షిప్పు సొమ్ము స్వాహా

గత తెలుగుదేశం పార్టీ హయాంలో పొదుపు సభ్యుల కుటుంబంలో చదువుకునే పిల్లలకు రూ.1,200 చొప్పున స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసింది. పిల్లలకు చెందాల్సిన స్కాలర్‌షిప్పు డబ్బులు పది సంవత్సరాలైనా ఒక్క రూపాయి కూడా లబ్ధిదారుల చేతికి అందలేదు. అయితే ఆ సొమ్ము ఏమైందని పలువురు ప్రశ్నించగా సంబంధిత అధికారుల నుంచి నేటికీ సమాధానం లేదు.

వరద బాధితుల సొమ్ము కాజేశారు

గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు విజయవాడ నగరం అతలాకుతలమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల నుంచి అధికారులను అప్రమత్తం చేశారు. అదేసమయంలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. దానికి నగరంలోని 155 సమాఖ్యల నుంచి రూ.2.73 లక్షలు తొలివిడత అందజేశారు. ఆ తర్వాత మరో రూ.6.90 లక్షలు పంపారు. మూడోసారి రూ.96వేలు పంపారు. అప్పటికే సహాయ నిధి లక్ష్యం పూర్తి కావడంతో రెండు, మూడోసారి పంపిన సుమారు రూ.7.86లక్షలను ప్రభుత్వం వెనక్కి పంపింది. ఆ డబ్బు ఆర్పీలకు చెందకపోగా, మెప్మా ఖాతాలోనూ లేదని తెలుస్తోంది. దీంతో వరద బాధితుల కోసం సేకరించిన డబ్బులు ఎలా మాయమయ్యాయో తెలియని పరిస్థితి ఏర్పడింది.

టీఎల్ఎఫ్ ఫండ్ దోచేశారు

పొదుపు సభ్యులు ప్రతినెలా టౌన్ లెవెల్ ఫెడరేషన్‌లో (టీఎల్ఎఫ్)లో దాచుకున్న సొమ్ముకు లెక్కలు తేలడం లేదు. ఒంగోలు నగరంలో మూడు టీఎల్ఎఫ్‌లు ఉండగా గడిచిన పదేళ్లకు సంబంధించి ఇప్పటి వరకు టీఎల్ఎఫ్ ఫండ్ సుమారు రూ.40 లక్షలు ఉండాలి. అందులో కొందరు పొదుపు సభ్యులకు సుమారు రూ.13 లక్షలు వరకు అప్పుగా ఇవ్వగా మిగిలిన సొమ్ము టీఎల్ఎఫ్ ఖాతాలోనే ఉండాలి. అయితే రూ.7లక్షలు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన సొమ్ము ఎలా గల్లంతైందో తేలాల్సి ఉంది. జిల్లాలో మెప్మా అక్రమాలపై అధికారులు సైతం మౌనంగా ఉంటున్నారు. ఇప్పటికైనా మెప్మాలో చోటుచేసుకున్న అవినీతిపై సమగ్రస్థాయిలో విచారణ చేయించి అక్రమాల లెక్క తేల్చాలని సభ్యులు కోరుతున్నారు.

8 నుంచి కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లు

- ఏర్పాట్లు చేస్తున్న బోర్డు అధికారులు
- అక్కడ 15శాతానికిపైగా తగ్గిన పంట ఉత్పత్తి



ఒంగోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటకలో ఈ సీజన్ పొగాకు కొనుగోళ్లకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 8నుంచి అక్కడ వేలం కేంద్రాలు ప్రారంభించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పొగాకు బోర్డు అధికారులు చేస్తున్నారు. ఈసారి కూడా కర్ణాటకలో పంట ఉత్పత్తి తగ్గినట్లు చెప్తున్నారు. గతంలో వలే అక్కడ 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా తొలుత 75 మిలియన్ కిలోలకు మించి పండే అవకాశం లేదని భావించారు. తాజా అంచనాల ప్రకారం దాదాపు 82 నుంచి 85 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఆ ప్రకారం చూసినా అనుమతించిన దాని కన్నా దాదాపు 15శాతానికిపైగా ఉత్పత్తి తగ్గనుంది. దీని వల్ల అక్కడి పంటకు డిమాండ్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మన రాష్ట్రంలోనూ, ప్రత్యేకించి దక్షిణాది కంటే కర్ణాటకలో పండే పొగాకును నాణ్యమైనదిగా భావిస్తుంటారు. దాని వల్ల ఇతర దేశాల్లోని పంటలకు సమానంగా అక్కడి పొగాకుకు ధరలు లభిస్తుంటాయి. అలాంటిది ప్రస్తుత సీజన్‌లో కర్ణాటకలో పంట ఉత్పత్తి కూడా తక్కువగానే ఉండటంతో ఇక్కడి కంటే ధరలు కాస్తంత అధికంగానే లభించే అవకాశాలు ఉన్నాయి.

కొనసాగుతున్న ప్రస్తుత సీజన్ కొనుగోళ్లు

మన రాష్ట్రంలో వచ్చే సీజన్ సాగు ఆరంభమైనా ప్రస్తుత సీజన్ కొనుగోళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. దక్షిణాది ప్రాంతంలో మరీ నెమ్మదిగా సాగుతున్నాయి. ఈ ఏడాది మార్చి 10న ఇక్కడ కొనుగోళ్లు ప్రారంభించారు. ఆరున్నర మాసాలు గడిచినా ఇంకా రైతుల వద్ద దాదాపు 46 మిలియన్ కిలోల పంట ఉన్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 11 వేలం కేంద్రాల పరిధిలో 105 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా తాజా అంచనా ప్రకారం 158 మిలియన్ కిలోలు పండించినట్లు భావిస్తున్నారు. అందులో ఈ ఆరున్నర మాసాలలో సుమారు 112 మిలియన్ కిలోల పొగాకును వ్యాపారులు కొనుగోలు చేశారు. కిలోకు సగటున రూ.232 ధర లభించింది. ఇంకా దాదాపు రైతుల వద్ద 46 మిలియన్ కిలోల పంట ఉంది. ఆ మొత్తం కొనుగోలు పూర్తికి ఇంకా నెలన్నర పట్టే అవకాశం కనిపిస్తోంది.


అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- డ్రోన్ కెమెరాలతో పేకాట కేంద్రాలపై నిఘా
- 16 ప్రాంతాల్లో దాడులు
- రూ.1,35,800 స్వాధీనం

7

డీఎస్సీపై అభ్యంతరాలకు 25 వరకూ గడువు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీపై అభ్యంతరాలు, ఫిర్యాదులను సమర్పించేందుకు వచ్చే నెల 25వతేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఆతర్వాత వచ్చే వాటిని పరిగణనలోకి తీసుకొనేది లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు మెగా డీఎస్సీ కన్వీనర్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫిర్యాదులు/ అభ్యంతరాల స్వీకరణకు ప్రభుత్వం జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలు, అప్పిలేట్ అథారిటీలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. జిల్లా స్థాయి పోస్టులపై అభ్యంతరాలను జోనల్ కమిటీకి.. జోనల్, రాష్ట్రస్థాయి పోస్టులకు సంబంధించిన అభ్యంతరాలను రాష్ట్రస్థాయి కమిటీకి నివేదించాల్సి ఉంటుంది. ఈ రెండు స్థాయిల్లో న్యాయం జరగలేదని భావిస్తే అప్పిలేట్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అభ్యర్థులు తమ అభ్యంతరాలకు సంబంధించిన ప్రింటెడ్ హార్డ్ కాపీని సంబంధిత ఎంపిక కమిటీకి, వాటినే ఈ మెయిల్ ద్వారా జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలకు పంపించాల్సి ఉంటుంది.



'గుండె'కు గండం..!

- చిన్న వయసులోనే గుండెపోట్లు
- మారుతున్న జీవనశైలే కారణం
- ఇటీవల పెరుగుతున్న మరణాలు
- జాగ్రత్తలతోనే జీవితం ఆనందం

7

పల్లెల్లో పచ్చలహారం

గ్రామాల్లో పుష్కరిణులు

- తొలివిడత మండలానికి ఒక చెరువు అభివృద్ధి
- ఆహ్లాదం... పచ్చదనం పెంపు లక్ష్యం
- ఉపాధి మెటీరియల్ కోటా నిధులతో పనులు
- ఇప్పటికే 25 గ్రామాలు గుర్తింపు



శంకరాపురంలో చెరువును పరిశీలించి గ్రామస్థులతో చర్చిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ఒంగోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదం, పచ్చదనం పెంపు లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పల్లె పుష్కరిణి పేరుతో చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కోటా నిధులతో పనులు చేపట్టనుంది. తొలివిడత మండలానికి ఒక గ్రామంలో ఈ ఏడాది పల్లె పుష్కరిణి ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే 25 మండలాల్లో గ్రామాలను ఎంపిక చేశారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉండే చెరువును గుర్తించి అందులో జంగిల్ క్లియరెన్స్, మట్టి కట్టల పటిష్ఠత, కట్టలపై గ్రావెల్ పరిచి వాకింగ్‌కు అనువుగా చేయడం, కట్ట పొడవునా ఇరువైపులా మొక్కలు నాటడం వంటి పనులు చేయనున్నారు. ఒక్కో చెరువు అభివృద్ధికి ఉపాధి పథకం మెటీరియల్ కోటా నుంచి రూ.3 లక్షలు కేటాయించనున్నారు. అదనంగా ఎంపీ కోటా నుంచి కూడా మిషన్‌లతో చేసే పనులకు నిధులు ఇచ్చేందుకు ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి అంగీకరించినట్లు సమాచారం. ఇప్పటికే ఎంపిక చేసిన గ్రామాల్లో కొత్తపట్నం, ముండ్లమూరు మండలం శంకరాపురం, ఒంగోలు మండలం ఉలిచి, నాగులుప్పలపాడు మండలం చేకూరపాడు, టంగుటూరు మండలం జమ్ములపాలెం తదితర గ్రామాలు ఉన్నాయి. మిగిలిన వాటిని ఇతర మండలాల నుంచి ఎంపిక చేశారు. కొత్తపట్నం, శంకరాపురంలో చెరువులు చాలా పెద్దవి కావడంతో ఒకవైపు కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే పార్కుల తరహాలో గ్రామాల్లో పల్లె పుష్కరిణిలను తీర్చిదిద్దుతామని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ చెప్పారు. అలాగే పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన సౌకర్యాలను కూడా క్రమంగా ఏర్పాటు చేయాలన్నది లక్ష్యమని వివరించారు.

జీఎస్టీ అమలుపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి పౌరసరఫరాల శాఖ అధికారులు
- మార్ట్‌లు, దుకాణాల్లో విస్తృత తనిఖీలు



మార్కాపురంలో మార్ట్‌ను పరిశీలిస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వస్తు సేవా పన్ను (జీఎస్టీ)ను కేంద్ర ప్రభుత్వం తగ్గించిన నేపథ్యంలో కొత్త ధరల అమలుపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో పౌరసరఫరాలశాఖ అధికారులు రంగంలోకి దిగారు. రెండు రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా మార్ట్‌లు, షాపులను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఆయా వస్తువుల విక్రయ ధరలను పరిశీలిస్తున్నారు. వినియోగదారులకు నూతన ధరలు తెలిసే విధంగా బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారు. శనివారం ఒంగోలులోని పలు మాల్స్, వ్యాపార సంస్థలను అధికారులు తనిఖీ చేశారు. ఆదివారం కూడా కొనసాగించారు. డీఎస్‌వో పద్మశ్రీ మార్కాపురంలోని ఓ మార్ట్‌ను పరిశీలించారు. అక్కడ విక్రయాలను చూశారు. ప్రభుత్వం జీఎస్టీని కుదించినందున ఆమేరకు ఆయా వస్తువులను ధరలను తగ్గించి విక్రయించాలని ఆదేశించారు. ఇతర అధికారులు ఎక్కడికక్కడ దుకాణాలకు వెళ్లి ధరల తీరును పరిశీలించారు. మరోవైపు వస్తు సేవల పన్ను తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీని నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

- కొత్తూరు సమీపంలో బైక్‌ను ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు

7


అవార్డు అందజేస్తున్న సమాఖ్య సభ్యులు

ఎంఈవో బాలాజీకి విశ్వనరుడు అవార్డు

టంగుటూరు,(కొండపి), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు ఎంఈవో-2 మహతి బాలాజీకి విశ్వనరుడు అవార్డు దక్కింది. సత్తెనపల్లికి చెందిన విశ్వనరుడు జాషువా సేవా సమాఖ్య వారు సమాఖ్య 26వ వార్షికోత్సవం, జాషువా 130వ జయంతి సందర్భంగా ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో బాలాజీకి అందజేశారు. బాలాజీ నెల్లూరు జిల్లా కందుకూరులో మహతి సేవా సంస్థను సొంత నిధులతో స్థాపించి తెలుగు భాషకు సేవ చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన సంస్థ ఆయనను అవార్డుకు ఎంపిక చేసింది. గుంటూరులోని రిటైర్డ్ ఉద్యోగుల భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఓపెన్‌స్కూల్స్ డైరెక్టర్ ఆర్.నరసింహారావు, ప్రకాశం జిల్లా డీఈవో ఎ.కిరణ్‌కుమార్, సంస్థ అధ్యక్షుడు ముట్నూరి వెంకయ్య, ప్రముఖ సాహితీవేత్త డా.భూసురపల్లి వెంకటేశ్వర్లు.. బాలాజీకి ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేశారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మార్కెట్ స్థలాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతమార్కెట్‌లోని స్థలాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం చేపట్టాలని వామపక్షాల నాయకులు నిర్ణయించారు. పాత మార్కెట్ స్థలాన్ని పీపీపీ విధానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు పాలకులు అప్పగించడాన్ని ఖండించారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో జీ. రమేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగర కార్యదర్శి చీకటిశ్రీనివాసరావు, సీపీఐ నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ నాయకులు కొంగర నరసింహం, జేవీవీ నాయకుడు ఏవీపుల్లారావు, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌రాంబాబు, శేషయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాకులు కంకణాల రమాదేవి, సుంకర సాయిబాబా, తంబి శ్రీనివాసులు, బీవీరావు, కే శ్రీనివాసరావు, శ్రీరామ శ్రీనివాసరావు, టీబీఎస్ రాజు ఉన్నారు.


పెంపుడు కుక్కలకు రేబిస్ రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ రవి

పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేయించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెంపుడు కుక్కలకు రేబీస్ రాకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలని ఒంగోలు నగర పాలక సంస్థకమిషనర్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పశుసంవర్ధకశాఖ పాలిక్లినిక్ అవరణలో ఆదివారం జరిగిన ప్రపంచ రేబిస్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెంపుడు కుక్కల యజమానులందరూ విధిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి. రవి మాట్లాడుతూ పెంపుడు జంతువులకు రేబిస్ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలకు, స్కూలు పిల్లలకు రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. పాలిక్లినిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎన్. జగత్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 275 కుక్కలకు రేబిస్ వ్యాధిరాకుండా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో దివ్య, విష్ణు, సికిందర్, కృష్ణ, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్ బాబ్జి, డాక్టర్ సురేంద్ర, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

'ఓట్ల దొంగ గద్దెదిగు' నినాదంతో సంతకాల సేకరణ

ఒంగోలు క్రైం,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): 'ఓట్ల దొంగ గద్దెదిగు' అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఒంగోలులో సంతకాల సేకరణ జరిగింది. ఒంగోలు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బీఆర్ గౌస్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో నగరంలో సంతకాల సేకరణ చేశారు.ఈసందర్భంగా గౌస్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ఓట్ల దొంగతనం ప్రజలకు వివరిస్తామని అన్నారు. ఈమేరకు ప్రజల మద్దతు కూడగట్టి సంతకాల సేకరణ నెలరోజులు పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉద్దండి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ కేవీపీ పాండు రంగారావు తెలిపారు. నగరంలోని కర్నూల్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ, భారత్ పెట్రోల్ బంకు ప్రాంతంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు అంతరాయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

కొండపి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోయవారిపాలెం గ్రామంలో కోతముక్క పేకాట ఆడుతున్న ఏడుగురిపై తమ సిబ్బందితో ఆదివారం దాడిచేసి వారివద్ద నుంచి రూ.6,850 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై బి.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులనున కోర్టుకు హాజరుపరిచామని ఎస్సై వివరించారు.

మద్దిపాడులో ఆరుగురు..


మద్దిపాడు : మండలంలోని ఇనమెనమెళ్లూరులో ఆరుగురు పేకాటరాయుళ్లను ఆదివారం ఆరెస్టు చేసినట్లు ఎస్సై వెంకటసైదులు తెలిపారు. వారివద్ద నుండి రూ.4600లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మహాచండీ మాంపాహి

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):దసర శరన్నవ రాత్రి ఉత్సవాలలో ఏడవ రోజైన ఆదివారం అమ్మవారు మహా చండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. ఒంగోలు నగరంలోని పలు దేవాలయాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష కుంకుమార్చనలు చేశారు. అదే విధంగా నగరంలో ఏర్పాటుచేసిన పలు పందిళ్లలో సైతం అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు.


మహాచండీ దేవి అలంకారంలో కామేపల్లి పోలేరమ్మ తల్లి


ఒంగోలు బాలాజీరావుపేటలోని పోలేరమ్మ గుడిలో మహాచండీదేవిగా అమ్మవారు


మంగమూరు రోడ్డులోని గాయత్రీ అమ్మవారికి చండీదేవి అలంకరణ

వివిధ అలంకారాల్లో అమ్మవార్లు

టంగుటూరు (కొండపి): శరన్నవరాత్రుల సందర్భంగా ఏడవరోజు ఆదివారం అమ్మవారు మహాచండి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారికి చీర, కుంకుమ, పసుపు, పూలు సమర్పించి మహిళలు పూజలు చేశారు. ఆలయ అర్చకుడు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు బి.రమేష్ పర్యవేక్షించారు.

కామేపల్లిలో.. జరుగుమల్లి మండలం కామేపల్లిలోని పోలేరమ్మ తల్లి ఆదివారం మహాచండి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో బైరాగి చౌదరి పర్యవేక్షించారు.

మహాచండీదేవిగా జ్వాలాముఖి అమ్మవారు

ఒంగోలు(రూరల్) :ఒంగోలు నగరం పెళ్లూరు గ్రామంలోని జ్వాలాముఖి అమ్మవారి దేవాలయంలో ఆదివారం శరవన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. దేవాలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు

పేదలకు అండగా వీరయ్య కుటుంబం

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు దివంగత మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన సతీమణి,చవటపాలెం ఎంపీటీసీ సభ్యురాలు ముప్పవరపు సుచిత్ర అన్నారు. విజయదశమి సందర్భంగా అమ్మనబ్రోలు గ్రామంలోని చిలకబడి వద్ద ముప్పవరపు సుచిత్ర వీరయ్యచౌదరి యువసేన ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ వైద్యశాల, పెదకాకాని శంకర్ కంటి వైద్యశాలల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా గుండె, కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు ఎంతో ఖర్చుతో కూడిన వైద్యాన్ని గ్రామీణ ప్రాంతంలో ఉచితంగా అందించాలన్న సంకల్పంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. వీరయ్య చౌదరి ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. ప్రతి ఏడాదిలాగే దసరా సందర్భంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను సుచిత్ర అందజేశారు. ఎస్టీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో మట్టి తోలించి చదును చేయించారు.శిబిరంలో హెల్ప్, శంకర్ వైద్యశాల వైద్యులు 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆపరేషన్‌లు అవసరమైన వారిని గుర్తించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ ఈదర వెంకట కృష్ణారావు, ఐటీడీపీ మండల అధ్యక్షుడు బెల్లం వెంకటేశ్వర్లు, వలేటి పాండురంగారావు, ఏడుగుండ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దివంగత వీరయ్య సతీమణి సుచిత్ర

'స్విమ్స్' సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (స్విమ్స్) సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, డయాబెటిక్ కేర్ సెంటర్ ఆదివారం ఒంగోలులో ఘనంగా ప్రారంభమైంది. స్థానిక సుందరయ్య భవన్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవం కలిగిన వైద్యుల నేతృత్వంలో ఒంగోలులో స్విమ్స్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు అతి తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్య సేవలు అందించడమే లక్ష్యం అన్నారు. తమ ఆసుపత్రిలో బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, తలనొప్పి, పక్షవాతం, నరాల బలహీనత, ఊపిరితిత్తులు, కిడ్నీ జబ్బులు, రక్త హీనత, గ్యాస్ ట్రబుల్, లివర్ జబ్బులు, విష జ్వరాలు, ఆర్థోపెడిక్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్విమ్స్ వైద్యులు డాక్టర్ అమల్ చల్లా, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి శీతారామయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, ఆర్డీవో చిన ఓబులేశు, జాలాది మణిబాబు, కమ్మసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణతోపాటు నగరానికి చెందిన పలువురు వైద్యులు, పాల్గొన్నారు.


స్విమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఉన్నత విద్యా మండలి కార్యదర్శికి అభినందనలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా నియమితులై ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కే తిరుపతిరావును ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్శిటీ ప్రొఫెసర్ డి.వెంకటేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ప్రొఫెసర్ తిరుపతిరావు సారధ్యంతో రాష్ట్రంలో ఉన్నత విద్యఅగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని వెంకటేశ్వరరెడ్డి కోరారు. తాను త్వరలో యూనివర్శిటీని సందర్శిస్తానని, తనవంతు సహాయ సహకారాన్ని అందిస్తానని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి హామీ ఇచ్చారు.

మన్ కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు ఆదివారం ఒంగోలులో వీక్షించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తితో పాటు పలువురు ఆ పార్టీనాయకులు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించిన తర్వాత మొదటి సారిగా నిర్వహించిన మన్ కీ బాత్ ఇది అని అన్నారు. అలాగే మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేయాలని కల్యాణ్ చక్రవర్తి కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, నాయకులు బొద్దులూరి అంజనేయులు, వైసీ యోగయ్య యాదవ్, మలగ రమేష్, రాయని రమేష్ తదితరులు ఉన్నారు.

2న మల్లవరం కల్యాణకట్ట వసతి గృహాల ప్రారంభం

మద్దిపాడు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):మల్లవరం వేంకటేశ్వర స్వామి సన్నిధిలో కల్యాణకట్ట వసతి గృహ ప్రారంభోత్సవం వచ్చే నెల 2వ తేదీన జరుగుతుందని శ్రీవారివనం అధ్యక్షుడు మార్నేని కృష్ణారావు తెలిపారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు శాసనసభ్యులు విజయ్ కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో గ్రానైట్ వ్యాపారి మృతి

చీమకుర్తి,సెప్టెంబర్28(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌స్ట్రోక్‌తో గ్రానైట్ వ్యాపారి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. తాడిపత్రికి చెందిన చంద్రశేఖర్(50) దశాబ్దం క్రితం చీమకుర్తికి వచ్చేసి యల్లయ్యనగర్ వద్ద సూర్యా గ్రానైట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి వ్యాపారాన్ని సాగిస్తున్నారు.కాగా ఆదివారం ఉదయం ఒంగోలులోని తన నివాసంలో ఒక్కసారిగా బ్రెయిన్‌స్ట్రోక్ రావటంతో హఠాన్మరణం పొందాడు. ఈయన మృతిపట్ల గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.చంద్రశేఖర్ మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తాడిపత్రికి తరలించారు.


మృతుడు చంద్రశేఖర్

కళాశాల అభివృద్ధికి కృషి

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మద్దిపాడు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కళాశాల పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. 1971-73 సంవత్సరాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కళాశాలలో ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, కుటుంబ వివరాలు, స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదివిన కళాశాలను అభివృద్ధి చేయటానికి తాము సిద్ధమని అన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా, విశ్రాంత అధ్యాపకులు దేవసహాయం, బ్రహ్మానందం అతిథులుగా పాల్గొన్నారు.

కమ్మవారి సేవాసంఘం సేవలు విస్తృతం చేస్తాం

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కమ్మవారి సేవాసంఘ కార్యక్రమాలను విస్తృతపరుస్తామని కమ్మవారి సేవా సంఘనాయకులు స్పష్టంచేశారు. ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులోని అతిథి ఫంక్షన్ హాల్లో కమ్మవారి సేవాసంఘం మహాజన సభజరిగింది. ఈసమావేశంలో సంఘం తరఫున వివిధసేవా కార్యక్రమాలకు చేసిన జమా ఖర్చులను వివరించారు. ఈ కార్యక్రమానికి కమ్మవారి సేవాసంఘ జిల్లా అధ్యక్షుడు మండవ మురళీ కృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి శీతారామయ్య,సంఘం కార్యదర్శి ఆలా హనుమంతరావు, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కన్వీనర్ కాట్రగడ్డ రఘుపతిరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీగిరి బ్రహ్మోత్సవాలు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):స్థానిక శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 30వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ మంగళవారం ఉదయం శ్రీవారికి తులసిదళార్చన, తోమాల సేవ, సాయంత్రం 7 గంటలకు హనుమంత వాహన సేవ ఉంటాయన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు మొవ్వ వృషాద్రిపతి శ్రీహరి వైభవంపై ప్రసంగిస్తారన్నారు. అక్టోబరు 1వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఊంజల్ సేవ, దేవస్థాన ఆస్థాన విద్వాంసులు వీవీఎస్ వినోద్ కుమార్‌తో గాత్ర కచేరి జరుగుతాయన్నారు. అక్టోబరు 2 గురువారం సాయంత్రం తిరువీధి ఉత్సవం, శ్రీ శ్రీనివాస మహిళా కోలాట భజన సమాజం వారిచే కోలాట ప్రదర్శన జరుగుతాయన్నారు. భక్తులు బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

'గుండె'కు గండం..!

నేడు వరల్డ్ హార్ట్ డే



చిన్న వయసులోనే పెరుగుతున్న హార్ట్ ఎటాక్‌లు

గుండెపోటుపై ముందే సంకేతాలు

వెలువడుతున్నా గుర్తించలేని జనం

మారుతున్న జీవన విధానమే కారణం

ఇటీవల పెరుగుతున్న మరణాలు

ఒంటరవుతున్న కుటుంబాలు

సరైన జాగ్రత్తలతోనే జీవన ఆనందం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గుప్పెడంత గుండె.. నిలువెత్తు మనిషిని బతికిస్తుంది.. నడిపిస్తుంది.. అది ఆరోగ్యంగా ఉన్నంతకాలం దానికి ఎదురే ఉండదు.. ఏ కాస్త కలత చెందినా.. నలతగా ఉన్నా అంతెత్తు మనిషిని అమాంతం పడేస్తుంది..! నేటి ప్రపంచంలో మధ్య వయస్కుల నుంచి వృద్ధుల వరకు గుండె నొప్పి(హార్ట్ ఎటాక్‌లు) బారి నపడుతున్నారు. శరీరంలో గుండె ప్రమాదంలో ఉందని ముందే సంకేతాలిచ్చినా వాటిని ప్రజలు గ్రహించలేకపోతున్నారన్నది వైద్యుల అభిప్రాయం. హార్ట్ ఎటాక్ వచ్చే ముందు మన శరీరంలో జరిగే మార్పులు, ఇచ్చే సంకేతాలు గమనించి తగిన వైద్యం తీసుకుంటే గుండె పదిలం. నేడు వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం.

● 50 ఏళ్లలోపు వారే అధికం

గుండెపోటు వచ్చిన వారిలో కనీసం సగం మందికి ముందస్తు హెచ్చరికలు, సంకేతాలు అందుతాయని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. పూర్వం 50 వయస్సు దాటిన వారిలో కనిపించేవి. ఇటీవల కాలంలో మధ్య వయస్సు వారిలో అధికమయ్యాయి. గుండెపోటు చలి కాలంలో సాధారణమేనని కొందరు వెల్లడిస్తుండగా, మరి కొందరు కుటుంబ బాధ్యతలు పెరగడం, వృత్తిరీత్యా ఒత్తిళ్లు, ప్రత్యేకించి ఆహారపు అలవాట్లు, బీపీ, షుగర్ ఇలా ఏదైనా కావచ్చు. అప్పటివరకు నలుగురిలో నవ్వుతూ కనిపించే వారు ఒక్కసారిగా కుప్పకూలిపోతున్నారు.

● కారణాలు ఇవీ..

గుండెపోటు రావడానికి ఎన్నో కారణాలు ఉంటాయి. వాటిలో ముఖ్యంగా కనిపించేవి కొన్ని, వీటిపట్ల తగిన అవగాహనతో ఉండాలని వైద్యులు వెల్లడిస్తున్నారు. శారీరక శ్రమ అసలు లేకపోవడం వలన, ఆహారపు అలవాట్లు వలన 80 శాతం మందిలో శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగి గుండెపోటు రావడానికి అవకాశాలు అధికంగా ఉన్నాయి. మానసిక ఆందోళన కారణంగా గుండెమీద ఒత్తిడి పెరిగి గుండెపోటు రావచ్చు. వంశపారంపర్యంగా కూడా 40 శాతంమందిలో ఈ సమస్య కనిపిస్తుంది. మద్యపానం, ధూమపానం, గుట్కా, ఖైనీ దురలవాట్లతోపాటు కొవ్వు పదార్థాలు ఎక్కువగా తినడం వలన రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వలన, మధుమేహం, హైబీపీ నియంత్రణ లేని మగవారిలో గుండెపోటుకు వచ్చే అవకాలు అధికమే. స్థూలకాయం, వ్యాయామం లేకపోవడం, గ్యాస్ట్రబుల్ వంటి కారణాలు.

ఆహార నియమాలతో ఆరోగ్యం

- అధిక రక్తపోటు ఉన్నవారు ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలి.
- ఉప్పుతో పాటు సోడియం పాళ్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలైన నిల్వ ఆహారం (ఫ్రిజర్ ఫుడ్, బేకరీ ఐటమ్స్, పచ్చళ్లు, అప్పడాలు, క్యాన్డ్ ఫుడ్స్) పూర్తిగా తగ్గించాలి.
- తాజా పండ్లు, పొట్టు ఉన్న తృణ ధాన్యాలు ఆహారంలో ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- కొవ్వు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్స్ తీసుకోకూడదు.
- కొలెస్ట్రాల్, నూనెలు, తక్కువగా తీసుకోవాలి. గుడ్డులో పచ్చ సొనను తినకూడదు.
- తాజా పండ్లు, ఆకుపచ్చటి కూరగాయలు చాలా మంచివి.
- వేటమాసం, కొవ్వు పాళ్లు ఎక్కువగా ఉండే పాల ఉత్పాదనలు, వెన్న, కొబ్బరిలాంటివి తీసుకోకపోవడమే మంచిది.
- మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా, ప్రాణాయమం వంటివి చేయాలి.
- రోజుకు కనీసం 6 నుంచి 8గంటలకు నిద్రపోవడం ద్వారా గుండె భద్రంగా ఉంటుంది.

Progression of plaque build-up in coronary artery



హార్ట్ ఎటాక్ ముందుగానే గుర్తించవచ్చు



- కారణం లేకుండా మైకం కమ్మినట్టు ఉంటుంది.
- తలనొప్పి మాటి, మాటికి వస్తుంటుంది.
- గుండె మెదడుకు రక్తాన్ని సరిగా సరఫరా చేయలేకపోవడం
- ఛాతీ పట్టేసినట్టు, మంటగా, నొప్పిగా, గుండె మీద బరువుగా అనిపిస్తే గుండె ప్రమాదంలో ఉందని అర్థం
- దీర్ఘకాలిక ఇన్‌ఫెక్షన్‌లు కనబడితే అప్రమత్తంగా ఉండాలి
- గుండెకు ఆక్సీజన్ సరిగా అందకపోతే ఇమ్యూన్ సిస్టమ్ దెబ్బతింటుంది.
- తద్వారా వారాల కొద్ది, నెలల కొద్ది జలుబు, జ్వరం వంటి సమస్యలు వస్తాయి
- పని ఏమీ చేయకుండానే అలసి పోవడం, అసలు ఏమాత్రం హుషారు లేకపోవడం
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్నా, గుండె ప్రమాదంలో ఉందని అర్థం
- చేతులు, పాదాలు, పొట్ట దగ్గర వాపులు కనిపిస్తుంటే గుండె రక్తాన్ని సరిగా శుద్ధి చేయలేకపోతుందన్న మాట.
- మంచి ఆహారం తీసుకున్నా, వికారం, అజీర్ణం వంటి సమస్యలు రావడం

అలవాట్లలో మార్పుతో మేలు

డాక్టర్ కే వెంకటేశ్వర్లు, కార్డియాలజిస్ట్, జీజీహెచ్



రోజూ నడక, జాగింగ్, వంటివి కనీసం 30 నిమిషాలైనా చేయాలి. యుక్త వయస్సులో ఉన్నవారు రన్నింగ్, ఈత కొట్టడం వంటివి చేయడం ద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రక్తపోటు, షుగర్ ఉన్నవారు తప్పనిసరిగా వాకింగ్ చేయడంతోపాటు, చక్కెర వాడకం పూర్తిగా నిషేధించాలి. పొగతాగడం గుండెపోటుకు ప్రధాన కారణం. పొగాకు వినియోగం ఏ రూపంలో ఉన్నా దాని వలన గుండెకు ప్రమాదం అని గుర్తించాలి. పొగాకు రసాయనాలు రక్తపోటును, గుండె వేగాన్ని పెంచి, రక్తంలోని ఆక్సిజన్ పాళ్లను తగ్గిస్తాయి.

ఏపీ చాంబర్స్ ఉపాధ్యక్షునిగా శిద్దా సుధీర్



శిద్దా సుధీర్

ఒంగోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఛాంబర్‌ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్(ఏపీ చాంబర్) రాష్ట్ర ఉపాధ్యక్షునిగా జిల్లాకు చెందిన యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌బాబు ఎంపికయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో 2025-27 మధ్య రెండేళ్ల కాలానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా పొట్లూరి భాస్కర రావు మరోసారి ఎన్నిక కాగా ఆ కమిటీలో సెంట్రల్ జోన్ ప్రతినిధిగా ఉపాధ్యక్ష స్థానానికి సుధీర్‌ను ఎంపిక చేశారు. గత రెండేళ్లు సుధీర్ సెంట్రల్ జోన్ అధ్యక్షునిగా పనిచేస్తూ రాష్ట్ర అసోసియేషన్‌లో గుర్తింపు పొందిన నేపథ్యంలో ఈసారి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎంపిక చేసినట్లు సమాచారం. గ్రానైట్ పరిశ్రమల్లో దిగ్గజ కంపెనీలుగా శిద్దా కుటుంబం ఉండగా అసోసియేషన్‌లో సుధీర్ క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఇటీవల గ్రానైట్ క్వారీ యజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. పారిశ్రామిక, వాణిజ్య వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా తన బాధ్యతలను నిర్వర్తించనున్నట్లు ఈసందర్భంగా సుధీర్ తెలిపారు.

డీఎస్పీగా ఎంపికైన మంగళకుంట యువతి

తెలంగాణ గ్రూప్-1 ఫలితాల్లో సత్తా



పిన్నిక ప్రశ్న

తర్లుపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగళకుంట గ్రామానికి చెందిన పిన్నిక ప్రశ్న తెలంగాణ రాష్ట్ర గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటారు. డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈమె విద్యాభ్యాసం మొత్తం తెలంగాణలోనే సాగింది. ప్రశ్న తండ్రి హరికుమార్ ఉమ్మడి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఏలూరు ఐజీగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. తల్లి శారద మంగళకుంట గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తూ 11 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ప్రశ్నను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

కొత్తూరు సమీపంలో బైక్‌ను ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు



జశ్వంత్ (ఫైల్)

పెద్దదోర్నాల,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా ప్రయాణిస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి కొత్తూరు సమీపంలో ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. చిత్తూరు జిల్లా తంబళ్లపల్లెకు చెందిన ఈడగొట్టు జశ్వంత్(21) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జశ్వంత్ మార్కాపురంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. జశ్వంత్ సొంతపని మీద బైకుపై కర్నూలు వెళ్లి తిరిగి మార్కాపురం వస్తుండగా దోర్నాల మండలం కొత్తూరు వద్దకు రాగానే శ్రీశైలం నుంచి వెళ్తున్న కర్ణాటక రాష్ట్రం బళ్లారి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. జశ్వంత్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై మహేష్ సిబ్బందితో వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ముందస్తుగా రేషన్ పంపిణీ ప్రారంభమైంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరికి ముందుగానే రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించడంతో తదనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,392 రేషన్‌షాపుల పరిధిలో 78,806 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారు. రేషన్ షాపుల డీలర్లు వారి నివాసాలవద్దకు వెళ్లి బయోమెట్రిక్ మిషన్‌లో వేలిముద్రలు వేయించుకొని అక్కడే సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఆదివారం డివిజన్‌కేంద్రమైన మార్కాపురంలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి పద్మశ్రీ ఆధ్వర్యంలో పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఈనెలాఖరు వరకు దివ్యాంగులు, వృద్ధులకు పంపిణీ జరుగుతుందని ఆమె చెప్పారు.

సెపక్‌తక్రా విజేతలు ఈస్ట్ గోదావరి, శ్రీకాకుళం

ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు



విజేతలకు కప్‌ను అందజేస్తున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు మినీ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగిన 35వ సీనియర్స్ స్త్రీ, పురుషుల రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి సుమారు వందమందికి పైగా క్రీడాకారులు హాజరు కాగా పురుషుల విభాగంలో తూర్పు గోదావరి జట్టు, మహిళ విభాగంలో శ్రీకాకుళం జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. పురుషుల విభాగంలో కర్నూలు ద్వితీయం, ప్రకాశం, అనంతపురం జట్లు తృతీయ స్థానంలో గెలుపొందాయి. అలాగే మహిళ విభాగంలో ప్రకాశం జట్టు ద్వితీయ స్థానంలో గెలుపొందగా, కోనసీమ జట్టు తృతీయ స్థానంలో గెలుపు సాధించాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన డాక్టర్ రామచంద్ర రెడ్డి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ శిక్షకులు సంఘ కార్యదర్శి పి.వేణు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు వై.సురేష్, ప్రధాన కార్యదర్శి డి.రవిరాజ్, సీనియర్ కోచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, ఎస్టీకమిషన్ మాజీ సభ్యుడు వడిత్యాశంకర్ నాయక్ అన్నారు, స్థానిక గిరిజనభవన్‌లో ఆదివారం నిర్వహించిన గిరిజన ప్రజాచైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి గిరిజన హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్, పేరం సత్యం, ఎన్. మోహన్‌కుమార్ ధర్మా, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలుకు తలమానికం.. కళారాల ఉత్సవం

వందల ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం

భారీగా తరలివచ్చే భక్తజనం

డప్పు మోతలు, మేళతాళాల నడుమ రాత్రంతా ఊరేగింపు, భక్తుల కోలాహలం

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాలు దేశమంతా జరుగుతాయి. ఈ ఉత్సవాలలో తొమ్మిది రోజులు అమ్మవారికి రోజుకొక అవతారం చొప్పున అలంకరిస్తారు. అయితే ఈ ఉత్సవాలలో ఎక్కడా లేని ప్రత్యేకత ఒంగోలు నగరానికి ఉంది. అదే కళారాల ఉత్సవం. ఈ ఉత్సవం మైసూరు, కోల్‌కత నగరాలలోనే కనిపిస్తుంది. కేవలం శిరస్సు వరకే ఉండే అమ్మవారిని కళారంగా అలంకరించి ఊరేగిస్తారు. ఇలా ఆరు కళారాలు ఉండగా, దుర్గాష్టమి రోజు మూడు, మహర్నవమి రోజు మూడు కళారాలను అర్ధరాత్రి నుంచి ఒంగోలులో ఊరేగిస్తారు.

కళారాలకు ప్రత్యేక చరిత్ర

రక్తబీజుడు అనే రాక్షసుడి తలను అమ్మవారు ఖడ్గంతో ఖండించగా అతని రక్తం ధారలుగా పారింది. ప్రతి రక్తపు చుక్కనుంచి మళ్లీ ఒక రాక్షసుడు పుట్టుకు రాగా రోజంతా యుద్ధం చేసినా రక్తబీజుడి సంహారం పూర్తి కాలేదు. దీంతో అమ్మవారి కాళికాదేవి అవతారం ఎత్తి పెద్ద నాలుకతో రక్తబీజుడి రక్తం భూమిపై పడకుండా తాగేసి సంహరించారు. దీంతో ప్రజలు అమ్మవారికి జయజయ ధ్వానాలు పలికి తమ మధ్యనే ఉండాలని అమ్మను వేడుకుంటారు. వారి కోరికను మన్నించిన అమ్మవారు తన భక్తులకు దుష్టశక్తుల నుంచి ఎటువంటి ఆపద రాకుండా తన అంశంతో నిండిన కళారాన్ని ప్రసాదిస్తారు. అందుకే అమ్మవారి కళారం కేవలం శిరస్సు వరకే ఉండి, నోరు తెరిచి నాలుక బయటకు పెట్టి ఉంటుంది.

వందల ఏళ్ల చరిత్ర

ఒంగోలులో నిర్వహించే కళారాల ఉత్సవానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. పూర్వకాలంలో చిన్నగూడు బండ్లపై ఊరేగించేవారు. కళారాల ముందు తప్పెట్లు వాయిస్తూ కాగడాలు పట్టుకుని అర్ధరాత్రి నుంచి ఉత్సవంచేసేవారు. ఈ కళారాన్ని దర్శించుకుంటే మళ్లీ విజయదశమి వరకు ఎటువంటి దుష్టశక్తులు తమను ఏమీ చేయవని భక్తుల నమ్మకం. కళారాల ఊరేగింపునకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు, కర్పూర హారతులు సమర్పించేవారు. కాలక్రమేణా ఊరేగింపులో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. గూడు బండ్ల స్థానంలో ట్రాక్టర్లు, కాగడాల స్థానంలో కళ్లు మిరుమిట్లుగొలిపే విద్యుత్ దీపాలు, తప్పట్లతో పాటు డీజేలు, బాణసంచా, వివిధ కళారూపాల ప్రదర్శనలు, అమ్మవారి వేషధారణలు ప్రస్తుతం కళారాల ఊరేగింపులో చోటుచేసుకుంటున్నారు. వీటిని చూసేందుకు వయసుతో నిమిత్తం లేకుండా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.



కళారాల ఊరేగింపులో వేషధారణలు (ఫైల్)

అట్టహాసంగా ఆరు కళారాలు

ఈ ఉత్సవంలో బాలాజీరావుపేటలోని కనకదుర్గాదేవి, గంటాపాలెం పార్వతీమాత, బీవీఎస్ హాల్ వద్ద ఉన్న బాలత్రిపురసుందరి, నరసింహస్వామి, అంకమ్మపాలెం కాళికామాత, కేశవస్వామిపేట మహిషాసురమర్ధని కళారాలు మొత్తం ఆరు పాల్గొంటాయి. ఇందులో నాలుగు కళారాలు పసుపు వర్ణంలో ఉండగా, కాళికాదేవి కళారం ఎరుపురంగులో నరసింహస్వామి తెలుపు రంగులో దర్శనమిస్తారు. దుర్గాష్టమి రోజు బాలాజీరావుపేట కనకదుర్గాదేవి, బీవీఎస్ హాలు వద్ద నుంచి బాలాత్రిపురసుందరీ దేవి, అంకమ్మపాలెం నుంచి కాళికామాత కళారాలను ఊరేగిస్తారు. ఆ రోజు రాత్రంతా నగరంలోని పలు వీధులలో కొనసాగే ఈ ఊరేగింపు తెల్లవారుజామున మస్తాన్ దర్గా కూడలికి చేరుకుంటుంది. మహర్నవమి రోజున గంటాపాలెం నుంచి పార్వతీదేవి, బీవీఎస్ హాలు వద్ద నుంచి నరసింహస్వామి, కేశవస్వామిపేట నుంచి మహిషాసురమర్ధని కళారాలు ఊరేగింపుగా బయల్దేరి విజయదశమి అంటే దసరా పండుగ రోజు తెల్లవారుజామున మస్తాన్ దర్గా సెంటర్‌కు చేరుకుంటాయి. ఈ విధంగా దసరా పండుగకు రెండు రోజుల ముందు నుంచి ఒంగోలు నగరంలో జరిగే ఉత్సవం ప్రత్యేకమని చెప్పొచ్చు. ఇక ఈఏడాది 30వ తేదీ మంగళవారం అర్ధరాత్రి నుంచి మూడు కళారాల ఊరేగింపు, అక్టోబర్ 1వ తేదీ అర్ధరాత్రి నుంచి మరో మూడు కళారాల ఊరేగింపు ఉంటుంది.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

డ్రోన్ కెమెరాల సాయంతో పేకాట కేంద్రాలపై దాడి

16 ప్రాంతాలలో దాడులు నిర్వహిచి రూ.1,35,800 స్వాధీనం



డ్రోన్‌లను ఎగురవేస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం పేకాట, కోడిపందేలు, బైక్ రేసులు, మట్కా స్థావరాలపై ఎస్పీ వి.హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహిచాయి. డ్రోన్ కెమెరాలతో పేకాట స్థావరాలను కనుగొన్నారు. మొత్తం 16 ప్రాంతాలలో దాడులు నిర్వహించి 80 మంది జూదరులను అరెస్టు చేశారు. పేకాటరాయుళ్ల వద్ద నుంచి రూ.1,35,800 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు తాలుకా -2, చీమకుర్తి-1, మద్దిపాడు-1, పొదిలి-1, తర్లుపాడు -1, త్రిపురాంతకం-1, కొండపి-1 గిద్దలూరు -1, రాచర్ల-1 కొమరోలు -1 కంభం-2, అర్ధవీడు-1, యర్రగొండపాలెం -2 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిపై 74 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే డయల్ 112, 9121102266 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

జాషువాకు ఘన నివాళి

ఒంగోలు నగరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : కవి కోకిల, పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, దళితసంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఒంగోలులో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవన్ ఆవరణలో జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేశు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మానాయక్ దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జాషువా కవిత్వం సామాజిక అసమానతలపై జరిగిన పోరాటంలో అక్షరాయుధంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ, బాబు మాదిగ, కవి కత్తి కళ్యాణ్, బంకా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మాల జేఏసీ కార్యాలయంలో గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయనతో పాటు సర్దార్ భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జేఏసీ చైర్మన్ కొప్పోలు ఏడుకొండలు, విశ్రాంత డీఈ మధుసూదనరావు, నాయకులు మిట్నసల శాంతారావు, మేడిద రవి, దాసరి రామారావు, రాంబాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డీఆర్వో ఓబులేశు, కమిషనర్ వెంకటేశ్వరరావు, డీడీ లక్ష్మానాయక్

మహాచండీ శరణు..శరణు


మార్కాపురంలో వేదవల్లిగా రాజ్యలక్ష్మి


గాయత్రీదేవిగా వాసవీ మాత


గిద్దలూరులో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు


త్రిపురాంతకంలో కాత్యాయనీదేవి అలంకారంలో అమ్మవారు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అమ్మలగన్న అమ్మ ముగురమ్మల మూలపుటమ్మ, శక్తి స్వరూపిణికి దసరా శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణంలో 7వ రోజు అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు వేదవల్లి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు. మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ కాత్యాయని అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను పర్యవేక్షించి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత గాయత్రిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొంతల పుల్లారావు, కార్యదర్శి వక్కలగడ్డ సురేశ్ కుమార్, కోశాధికారి చక్కా మాలకొండ చిన్న నరసింహారావు కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద పంపిణీ నిర్వహించారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. జవహర్ నగర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సంతానలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు.

పొదిలి : కంభాలపాడు పంచాయతీలో వెలసిన అంకాలపరమేశ్వరీదేవి మాహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

గిద్దలూరు : దసరా శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉభయదాతలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి 108 రకాల ప్రసాదాలను సమర్పించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగ సతనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. షరాఫ్‌బజారులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారు పరశురామ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పెద్దదోర్నాల : అమ్మవారు శ్రీ శారదా పరమేశ్వరీ దేవి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి, శ్రీపోలేరమ్మ, సాయిబాబా, తిమ్మపురంలోని శ్రీ చౌడేశ్వరీ దేవి ఆలయాల్లో నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి (పట్టుచీర) సారెను అందజేశారు.

త్రిపురాంతకం : శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల్లో అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు కళాకారులు ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. సంప్రదాయ నృత్య రూపకాలు, కోలాటాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం కాత్యాయని దేవిగా అమ్మవారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కంభం : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారు పార్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ కోటా సత్యమాంబ త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా దేవాలయాల ప్రాంగాణాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఎర్రగొండపాలెం : శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పట్టు వస్త్రాలను సమర్పించి, పూజలు చేశారు. ఆయనతోపాటు ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు ఉన్నారు.

కొమరోలు : శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మోహినీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానం అధ్యక్షుడు తుమ్మలపెంట వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారికి తోట ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు కోలాట నృత్యంతో చేరుకున్నారు.

విద్యార్థులకు సాంకేతికతపై అవగాహన

మార్కాపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టమీదిపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు సాంకేతిక అంశాలపై పట్టణంలోని పలుచోట్ల అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ బి.వేణుగోపాల్ తెలిపారు. పాఠశాలకు చెందిన ఐటీఐ, టీఈఎస్, ఆటోమోటివ్ ట్రేడ్‌లకు చెందిన విద్యార్థులకు ఆన్‌లైన్ వర్క్‌పై సచివాలయం, సీఎస్‌సీ సెంటర్లు, డిజిటల్ వర్క్స్, ఫోటోషాప్, ఫ్లెక్సీ ప్రింటింగ్, మీ సేవా, ఎలక్ట్రానిక్ సేల్స్ గురించి విద్యార్థులు తెలుసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ ట్రైనర్ కిషోర్, ఇండస్ ఐటీ ఒకేషనల్ ట్రైనర్ షేక్ ఉస్మాన్‌బాష, బి.అశోక్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల సందర్భంగా ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలైన మహిళలకు ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షుడు కొత్తమాసు సుబ్రమణ్యం, అసోసియేషన్ నాయకులు నాగేశ్వరరావు, తిమ్మయ్య, సుబ్రమణ్యం బహుమతులను అందజేశారు.

జూదరుల అరెస్టు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13800 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలం పొదలకొండపల్లె గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న అర్బన్ సీఐ కె.సురేష్ అదుపులోకి తీసుకుని వారిని కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

తర్లుపాడు : కేతగుడిపిలో పేకాట స్థావరాలపై ఎస్ఐ బ్రహ్మనాయుడు దాడులు నిర్వహించారు. ఇంటిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.1670 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శ్రీగంధం చెట్లు చోరీ

కంభం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన బెల్లంకొండ నాయుడు తోటలో 6 శ్రీగంధం చెట్లను నరికి చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. వాటి విలువ రూ.3లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

అడవిలో వేట నిషేధం

గూడెంవాసులకు అధికారుల అవగాహన

పెద్దదోర్నాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అడవిలో వన్యప్రాణులను వేటాడడం నిషేధమని ఫారెస్ట్ రేంజ్ అధికారి హరి అన్నారు. మండలంలోని పనుకుమడుగు గిరిజన గూడెంలో దసరా పండుగ సందర్భంగా వేటాడటం వంటి చర్యలపై ఆదివారం చెంచు గిరిజనులకు ఆయన అవగాహన కల్పించారు. హరి మాట్లాడుతూ వన్యప్రాణులు ఎంత స్వేచ్ఛగా మనగలుగుతాయో మనం అంత ఆరోగ్యంగా జీవిస్తామని చెప్పారు. ముఖ్యంగా అడవిని నమ్ముకుని జీవించే గిరిజనులు వన్యప్రాణుల సంరక్షణ విషయంలో బాధ్యతగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌వో చెన్నయ్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం : వన్యప్రాణి సంరక్షణ, అటవీ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని మార్కాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్.పిచ్చిరెడ్డి అన్నారు. పూలసుబ్బయ్య కాలనీ, బాపూజీ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ ప్రాంతాల్లో వన్యప్రాణి సంరక్షణ, అటవీ చట్టాలపై రూపొందించిన పోస్టర్‌లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వన్యప్రాణులను వేటాడడం నేరమన్నారు. అటువంటి సంఘటనలకు పాల్పడితే శిక్షలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో జి.నాగరాజు గౌడ్, ఎఫ్‌బీవోలు జి.రవికుమార్, బాలకుమారి, ఏడుకొండలు, ధనలక్ష్మి, రామసుబ్బారావు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు నివాళి


జాషువా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు, టీడీపీ నాయకులు

ఎర్రగొండపాలెం : మహాకవి గుర్రం జాషువా అని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. తెలుగు కవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా గుర్రం జాషువా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జాషువా పద్యాలను గుర్తుచేశారు. ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, తోట మహేష్, వేగినాటి శ్రీను, పి మల్లిఖార్జునరావు, గోవింద్, చెవుల అంజయ్య, చేదూరి లక్ష్మయ్య, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : విశ్వకవి గుర్రం జాషువా అని మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య యాదవ్ అన్నారు. ఆదివారం గుర్రం జాషువా జయంతి సందర్భంగా జాషువా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలయ్య మాట్లాడుతూ వడగాడ్పు నా జీవితమైతే వెన్నెల నా కవిత్వం అన్న నవయువ కవి జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో గుర్రం బాబూరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ కత్తి అన్నోజీరావు, వినుకొండ మమతచిన్ని, గుర్రం డానియేల్, పందీటి రజనికుమార్, గుర్రం సుధీర్‌బాబు, ఏబు, పెరికె జయరావ్, పరదేశి రాజశేఖర్, బొప్పూరి ప్రసాద్ పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : కవి గుర్రం జాషువా జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీసీ భవన్‌లో బీసీ సంఘ నాయకులు జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పిన్నిక లక్ష్మీప్రసాద్, రంగస్వామి గౌడ్, శ్రీనివాస్, పురుషోత్తం, గుమ్మా గంగరాజు పాల్గొన్నారు.

పొదిలి : గుర్రం జాషువా జయంతిని కవి పావులూరి మల్లికార్జునరావు అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్ఎన్ కాలేజీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గోవిందయ్య జాషువా పద్యాలు, రచనలు గొప్పవన్నారు. అనంతరం చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జునరావు, బుర్రి శ్రీనివాసులు, చావలి మురళీకృష్ణ, సీతారామయ్య, బుజ్జిబాబు, వెంకటేశ్వర్లు, విజయగోపాల్, వంశీ, మోన్‌క్రిష్ణ పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

గిద్దలూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖగ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు. వివిధ విభాగాలలో స్వరూప్, యోగితారెడ్డి, సుజిత్, జశ్విత, అవినాష్, చరితేజ్, అభిషేక్, హేమంత్, ప్రనవ్, సీయజ్, అభినశ్రీ, దాఫియాలు విజేతలు కాగా, పందిళ్ళపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి, రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బోడపాడు గ్రామంలో ఆదివారం పోలేరమ్మ జాతర చేశారు. రంగనాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసి 41 రోజులైన సందర్భంగా ఈ జాతర నిర్వహించారు. యాదవులు మూడు కుంకుమ బండ్లు కట్టి ఊరేగింపుగా వెళ్లారు. మహిళలు పోలేరమ్మ బండ్ల ముందు భక్తితో అమ్మవారి పాటలకు నాట్యం చేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గ్రామోత్సవంలో పాల్గొన్నారు. బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి పోలేరమ్మ తల్లికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, యువకులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ వివేకానంద హయ్యర్ సెకండరీ పాఠశాలలో 1969-70లో 12వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల 9వ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. స్థానిక విశ్వభారతి పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థులు సమావేశానికి అప్పటి గురువులైన లంక సత్యనారాయణ, వీరారెడ్డి, అచ్చిరెడ్డి హాజరయ్యారు. పేద విద్యార్థుల సహాయార్థం ఎం.వెంకటసుబ్బయ్య 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. 9వ పర్యాయం సమావేశం కావడం ఎంతో ఆనందాన్ని ఇస్తున్నదని, అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు బొమ్మినేని బాలయ్య, మురళీకృష్ణ, రామచంద్రారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, డాక్టర్ ప్రసాద్, విశ్వభారతి పాఠశాల కరస్పాండెంట్ రంగస్వామిరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని వేమలకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ హెచ్‌ఎం అన్నిలాషిణి, ఉపాధ్యాయులు మహేశ్వరరెడ్డి, ఆంజనేయరెడ్డి, చలపతిరావు, వీరనారాయణరెడ్డి, ఎలిజిబెత్‌రాణిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రస్తుత హెచ్‌ఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగ సన్నిధిలో గంగమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడుకున్నారు. వాహనదారులు వాహన పూజలు చేయించగా, మరికొందరు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకపూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు.

కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌ఏ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


నూతనంగా పదవులు పొందిన నేతలను సన్మానిస్తున్న ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని కంభాలదిన్నెలో పార్టీ గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర, విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సభలో డాక్టర్ ఉగ్ర మాట్లాడారు. ఏఎంసీ, సింగిల్‌విండో పదవులు పొందిన యారవ శ్రీను, ఉప్పలపాటి హరిబాబు తమ సొసైటీల ద్వారా రైతుల సమస్యలు పరిష్కరించి మన్ననలు పొందాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బొల్లా నరసింహారావును అభినందిస్తూ పార్టీలోని అన్నివర్గాల వారిని కలుపుకొని మండలంలో టీడీపీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. అనంతరం యారవ శ్రీను, బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లును శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోటపాటి జనార్దనరావు, గోళ్ల భాస్కరరావు, చుంచు కొండయ్య, గద్దె గంగయ్యచౌదరి, పువ్వాడి వెంకటేశ్వర్లు, కేవీ రమణయ్య, దరిశి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశంలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మండిపడ్డారు. ఎంపీపీ వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ సమావేశం నుంచి అర్థంతరంగా వెళ్లిపోయారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఎంపీడీవో వి.ప్రతాప్‌రెడ్డి ముందుగా ఎమ్మెల్యే ఉగ్రను కాకుండా ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లును పిలిచారు. ఆతరువాత ఎమ్మెల్యేను వేదిక పైకి పిలిచారు. వేదిక పైకి జిల్లా ఛీఫ్ సొసైటీ చైర్మన్ టీ.గోపిని ఆహ్వానించమని ఎమ్మెల్యే సూచించారు. వైస్ ఎంపీపీని కూడా పిలువాలి అని ఎం పీపీ తెలపగా, జిల్లాస్థాయి పదవులు ఉన్న వారిని పిలవకపోతే మేమెందుకు అంటూ అసహనం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చ అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన జె.భారతి, జి.వెంకటేశ్వర్లును సన్మానించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రులు

దర్శి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక కనకదుర్గమ్మ గుడి, పోలేరమ్మ గుడి, వాసవీ అమ్మవారి ఆలయం, వేంకటేశ్వరస్వామి గుడి, దద్దాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారు శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చి పూజలు అందుకున్నారు. మహిళలు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.


దర్శి: శాకాంబరీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు


పామూరు: సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు

ముండ్లమూరు: శరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆరవ రోజు ఆదివారం అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేశారు. మారెళ్ళ, ముండ్లమూరు, పులిపాడు, ఈదరతోపాటు పలు గ్రామాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొప్పూడివారిపాలెం, నాయుడుపా లెం, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం గ్రామాల్లో పోలేరమ్మ అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు.

ఘనంగా కుంకుమార్చన పూజలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం భైరవకోనలో శరన్నవరాత్రుల వేడుకలు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యాంసుందర్‌రాజు, ఈవో డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నరు. ఆదివారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అభిషేకాలు, కుంకుమార్చన పూజలు, చండీ హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.వెంగయ్య, ఎస్‌సీ మాలకొండయ్య, సీహెచ్ వెంకటరెడ్డి, ఎ.రామకృష్ణంరాజు, కేవీ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కె.చిన్న ఆదినారాయణ, ఈవో నరసింహబాబు, టీడీపీ మండల టీడీపీ అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, వెంకటాద్రి , తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం' ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


మీకోసం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పవిత్ర పంక్షన్ హాలులో సోమవారం జరిగే మీకోసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. అదేవిధంగా కార్యక్రమం సందర్భంగా వచ్చే అర్జీ దారులకు అన్ని రకవాల వసతలు, సౌకర్యాలు కల్పించేవిధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్ రవిశంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాగా, కనిగిరి నియోజకవర్గంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవిశంకర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డితో పాటు వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు, రైతులు తమ సమస్యలను నేరుగా పరిష్కరించు కోవచ్చునని చెప్పారు. తమ సమస్యలను అర్జీ రూపంలో వ్రాసి సంబంధిత జెరాక్స్ కాపీలను జతచేసి ఇవ్వాలని కోరారు. అర్జీలో తమ సెల్‌ఫోన్ నెంబర్‌ను వ్రాయాలని పేర్కొన్నారు.

జాషువాకు నివాళి

కనిగిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అసమానతలు లేని సమాజం కోసం అలుపెరగని కృషి చేసిన మహనీయుడు గుర్రం జాషువా అని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్ అన్నారు. జాషువా జయంతి సందర్భంగా ఆదివారం ఆర్‌అండ్‌బీ బిల్డింగ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పట్టిపీడిస్తున్న అసమాన తలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా తన కవితల ద్వారా చైతన్యం రేపి అసమానతలను ప్రారద్రోలిన మహనీయుడు జాషువా అని అన్నారు. అలాంటి మహనీయులను నేటితరం మననం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లా మాలకొండయ్య, భాస్కర్, కంటు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వేపగుంపల్లిలో పారిశుధ్య కార్యక్రమాలు

పీసీపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపగుంపల్లిలో ఆదివారం సర్పంచ్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకుండా నిర్ణయించిన ప్రదేశాల్లో మాత్రమే వేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశ్వరూపాచారి, తదితరులు పాల్గొన్నారు.

పెదరావిపాడులో..

ముండ్లమూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పెదరావిపాడులో గత వారం రోజుల నుంచి ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ గొర్రె శ్రీదేవిరాముడు ఆధ్వర్యంలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు కాలువల్లో మురుగు పేరుకుపోయింది. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు సర్పంచ్ శ్రీదేవి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

భగత్‌సింగ్‌కు నివాళి

కనిగిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ఉరికొయ్యను ముద్దాడి తన ప్రాణాలను తృణప్రాయంగా ఒదిలేసిన ధీరుడు భగత్‌సింగ్ అని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. స్థానిక దర్శి చంచయ్య భవనం వద్ద యువజన, విద్యార్థి సంఘాల అధ్వర్యంలో భగత్‌సింగ్ 118వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ 23ఏళ్ళ చిరుప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి త్యాగధనుడిగా మారిన భగత్‌సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమసమాజ స్థాపనకు కృషి చేయాల్సిన యువత కొంతమంది డ్రగ్స్‌కు బానిసలుగా మారి వారి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సుబ్బారావు, జీవన్‌బాబు, ఇఫ్రాజ్, గణేష్, నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మరిన్ని సేవలు అందించాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులకు మరిన్ని సేవలు అందించాలని రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పూరిమెట్లలో ఆయనను మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమల రావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు చింత పల్లి వెంకటేశ్వర రావు, పాలపర్తి సుబ్బారరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ కోడిగ మస్తాన్‌రావు, తదితరులు రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్‌మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.





- రూ.3 వేల కోట్లతో అతిపెద్ద పర్యాటక కేంద్రం
- తుది మెరుగుల్లో ఎన్టీఆర్ స్మారకం డీపీఆర్

రాజధానిలో.. ఠీవీగా ఎన్టీఆర్

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతిలో నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహాన్ని నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. పదేళ్లనాటి ఈ కలను సాకారం చేయాలని ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలగా ఉన్నారు. దీనికి సంబంధించి డీపీఆర్ కూడా దాదాపు సిద్ధమైంది. గత మేలో షెలాడి అసోసియేట్స్ అనే కంపెనీకి డీపీఆర్ తయారీ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కార్పొరేషన్ అప్పగించింది. కాగా ఈ కంపెనీ రూపొందించిన విగ్రహ నమూనాలను ఇటీవల చంద్రబాబు పరిశీలించారు. రాజధాని పరిధిలోని నీరుకొండ 169 ఎకరాల్లో విస్తరించి సుమారు 300 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ కొండ శిఖరంపైన సుమారు 14 ఎకరాలను చదును చేసి ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా తయారుచేయనున్నారు. ఇక్కడ ముందుగా వంద అడుగుల ఎత్తులో బేస్ నిర్మాణాన్ని చేపట్టి దానిపై మరో 200 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. అపుడు కొండ పీఠభాగం నుంచి మొత్తం ఎత్తు ఆరొందల అడుగులుగా ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. ప్రభుత్వం నిర్మించనున్న గవర్నమెంట్ కాంప్లెక్సులో ఓ చివర నుంచి సీఎం నివాసం, రాజ్‌భవన్, సెక్రటేరియేట్, అసెంబ్లీ భవనాలు రానుండగా అదే వరుసలో ఇటు చివరన నీరుకొండ శిఖరంపై ఎన్టీఆర్ విగ్రహం వస్తుంది. మొత్తంగా చూస్తే కొండపై నుంచి ఎన్టీఆర్ విగ్రహం ఉత్తరాభిముఖంగా ఉండి రాజధాని మొత్తాన్ని చూస్తున్నట్టుగా దృశ్యభావన కలుగుతుంది.

ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం

ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టును సాదాసీదాగా కాకుండా నిర్వహణ భారం కానివిధంగా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో గత వైసీపీ ప్రభుత్వం నిర్మించిన డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్ ప్రాజెక్టు అసంపూర్ణంగా ఉండి విజయవాడ నగరపాలకసంస్థకు నిర్వహణభారంగా మారంది. దీనిని దృష్టిలో ఉంచుకునే ఎన్టీఆర్ ప్రాజెక్టును సమగ్రంగా చేపట్టి భవిష్యత్తులో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తకుండా పర్యాటక, వాణిజ్య పరమైన అంశాలను కూడా జోడిస్తున్నారు. ఆ దిశగా ఇప్పటికే విజయవంతంగా, పర్యాటకులను ఆకట్టుకునేలా (మిగతా 6లో)



ఎన్టీఆర్ విగ్రహ ఆకృతులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు (పాతచిత్రం)

స్టాచ్యూ ఆఫ్ యూనిటీ స్ఫూర్తిగా...

గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (సర్దార్ వల్లభాయ్‌పటేల్) విగ్రహ నమూనాను స్ఫూర్తిగా తీసుకుని నీరుకొండపై ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని గతంలో రూ.450 కోట్లతో వంద అడుగుల ఎత్తులో నిర్మించాలని భావించింది. అయితే అమరావతిలో ఈ ప్రాజెక్టు అత్యున్నతంగా ఉండాల న్న ఆలోచనతో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎన్టీఆర్ విగ్రహాన్ని సుమారు 600 అడుగుల ఎత్తులో నిర్మించేలా డిజైన్‌లో మార్పు చేశారు.



నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం నమూనా

రాజధానిలో స్వర్గీయ నందమూరి తారక రామారావు నిలువెత్తు విగ్రహం ఠీవీగా ఉండనున్నది. అమరావతి ఖ్యాతిని.. విశిష్టతను పెంచేరీతిగా.. తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచం నలుదిశలా చాటేలా.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ స్మారక ప్రాజెక్టును చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టు పేరుతో రాజధాని అమరావతిలోని నీరుకొండపై దేశంలోనే అత్యంత పెద్దదైన ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని నెలకొల్పనున్నది. రూ.3 వేల కోట్లతో దీనిని నభూతో నభవిష్యత్ అన్నచందంగా పెద్దఎత్తున అభివృద్ధి చేయనున్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్ విగ్రహం నీరుకొండ కొండపై చాలా ఠీవిగా నిలబడనుంది. రాజధాని పరిధిలో శాఖమూరు సెంట్రల్‌పార్కు, రివర్ ఫ్రంట్, ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టులు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా నిర్మిస్తున్నారు.



మార్టూరులో మహచండీదేవి అవతారంలో అమ్మ వారు

అట్టహాసంగా దసరా ఉత్సవాలు

మార్టూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో ఏడో రోజు ఆదివారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మార్టూరులో దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో మహాచండీ దేవి అవతారంలో, ద్రోణాదులలో వారాహి అవతారంలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. వలపర్ల, మార్టూరులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో,పడమర బజారున రుక్మాబాయి సమేత పాండురంగ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో, నాగరాజుపల్లిలోని దేవాలయంలో అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మార్టూరులో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శనివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

అక్రమ లేఅవుట్లపై అలక్ష్యం

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా ప్రేక్షకపాత్ర
- అక్రమార్కులపై చర్యలకు అధికారుల మీనమేషాలు
- అటు ప్రభుత్వానికి, ఇటు కొనుగోలుదారులకు తీరని నష్టం

చీరాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకోవడంలో అధికారులు అలక్ష్యం చూపుతున్నారు. ఇబ్బడిముబ్బడిగా అక్రమ లే అవుట్లు వెలుస్తున్నా అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు. అక్రమల లేఅవుట్లతో ప్లాట్లు కొనుగోలు చేసి బ్యాంకుల నుంచి రుణాలు రాక. నిర్మాణాలకు అనుమతులు అందక పలువురు అల్లాడుతున్నా అధికారులు తమకు ఏమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అక్రమ లేఅవుట్లతో రియల్టర్లు జేబులు నింపుకునేందుకు అధికారులు సహకరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లేఅవుట్లకు అనుమతులు ఒంగోలు ఉడా పరిధిలో ఉన్నాయని అధికారులు నెలవారీ మామూళ్లతో కన్నెత్తి చూడటంలేదని సమాచారం. లేఅవుట్ నిర్మాణానికి సంబంధించి కన్వర్షన్ చెల్లింపుల్లో అధికారులు, అక్రమార్కులు ఏకమై నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారన్న విమర్శలున్నాయి. ఒత్తిడి పెరిగితే కన్వర్షన్‌కు దరఖాస్తులు చేయిస్తున్నారు గానీ చెల్లింపులు పూర్తి చేయనీయడం లేదు. ఏదయినా ఇబ్బంది జరిగుతుంది అనుకుంటే అప్పుడు వ్యవహారాన్ని పట్టాలెక్కిస్తున్నారు. నియోజకవర్గంలో పర్యాటక రంగం అభి వృద్ధికి కూటమి బాటలు వేసింది. దీంతో రిసార్ట్‌లు, విల్లాలు పెరుగుతు న్నాయి. 300 చదరపు అడుగులపైన వాణిజ్య భవనాలు నిర్మాణాలు జరగా లంటే ఉడా అనుతులు తప్పని సరి. అయితే అందుకు సంబంధించి ఎటు వంటి ప్రక్రియ జరగడం లేదు. పైగా కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు జరపాలంటే రిజిస్ట్రేషన్‌లో సుమారు 45 శాతం అపరాధ రుసుము చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంత జరుగుతున్నా అధికారులు మహా అయితే నోటీసులు ఇచ్చి ముఖం తిప్పుకుంటున్నారు.



చీరాల - వేటపాలెం జాతీయ రహదారిలోని లే అవుట్

విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తాం

- దివ్యాంగులకు ట్రై స్కూటీల పంపిణీలో మంత్రి గొట్టిపాటి

అద్దంకి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని విద్యార్థులకు సైకిళ్లు, దివ్యాంగులకు ట్రైస్కూటీలను అందజేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ సహకారంతో ఆదివారం 35 మంది దివ్యాంగులకు అద్దంకిలో రూ.49 లక్షల విలువైన ట్రై స్కూటీలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు కూడా సైకిళ్లు అందజేస్తామన్నారు. విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబసభ్యులకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం అంద జేశారు. మెగా డీఎస్సీలో ఎంపికైన అనూషను మంత్రి అభినందిం చారు. అద్దంకిలో విద్యుత్ సమస్య లేకుండా చేయాలని 1300 స్థంభాలను మార్చామని, మరో 700 మార్చేం దుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ పీ కాలనీ, ద్వారకానగర్, టిడ్కో ఇళ్ల వద్ద సబ్‌స్టేషన్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో రూ.19.60 కోట్లతో 564 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి 2252 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. మరో వెయ్యి కనెక్షన్లను త్వరలో మంజూరు చేస్తామన్నారు. తిమ్మాయపాలెం నుంచి రామాయపాలెం, మారెళ్ళ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని త్వరలో పను లు ప్రారంభమవుతాయన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి 100 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరిప రమేష్, మానం మురళీమోహన్‌దాస్, కఠారి నాగేశ్వరరావు, కాకాని అశోక్, కుందారపు రామారావు, గుంజి శ్రీనివాస రావు, బండారపల్లి శ్రీనివాసరావు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగురాలుకి స్కూటీని అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



ట్రైస్కూటీలతో దివ్యాంగుల ప్రదర్శన



వరదనీరు పోటెత్తటంతో పెనుమూడి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

కృష్ణమ్మ.. మహోగ్రం

- బిక్కుబిక్కుమంటున్న లంకలు
- పెనుమూడి పల్లెపాలెం తాకిన వరద
- బ్యారేజి నుంచి 6.50 లక్షల క్యూసెక్కులు విడుదల
- ఇసుక బస్తాలతో కరకట్టను పటిష్ఠం చేస్తున్నఅధికారులు
- లంక గ్రామాల్లో కలెక్టర్ పర్యటన.. నదిలో ఉధృతి పరిశీలన

కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి భారీగా నీటి విడుదలతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఆదివారం ఉదయం నుంచి నదిలో వరద క్రమేపీ పెరుగుతూ సాయంత్రానికి తీవ్రమైంది. శ్రీశైలం నుంచి 5,88,743 క్యూసెక్కుల వస్తుండగా వచ్చిన నీరు వచ్చినట్లుగా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి కూడా దిగువకు విడుదల చేస్తున్నారు. ఆరు లక్షల ఎనిమిది వేల క్యూసెక్కులు నీరు వస్తుండటంతో పులిచింతల ప్రాజెక్టు అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కూడా 6.50 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. సోమవారం ఉదయం 8 గంటలకు 6.57 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం దాటొ చ్చని ఇరిగేషన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో బ్యారేజీ నుంచి సముద్రం వరకు కృష్ణమ్మ ఉరకలెత్తుతూ ప్రవహిస్తోంది. కృష్ణానదికరకట్ట, ఓలేరుపల్లెపాలెం, రావిఅనంతవరం, కనగాలవారిపాలెం, బొబ్బర్లంక, విశ్వేశ్వరం, పెనుమూడి ప్రాంతాల్లో బలహీనంగా కరకట్టను ఇసుకబస్తాలతో అధికారులు పటిష్ఠం చేస్తున్నారు. ఇప్పటికే పెనుమూడిపల్లెపాలెంలో తీరంలోని గృహాలు నీటమునిగాయి. పెసర్లంక వెళ్లే చిన్నరేవు ఓలేరు నుంచి వెళ్లే చిన్నరేవు వరదనీటిలో మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెనుమూడిపల్లెపాలెంలోని వారిని పునరావస కేంద్రాలకు తరలించారు. పునరావసకేంద్రాల్లో ఫ్యాన్లు ఏర్పా టు చేసి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలంటూ మంత్రి శివప్రసాద్ అధికారులకు సూచించారు.

వరద నీరు కొల్లూరు మండలంలోని సుగ్గున లంక, చింతల్లంక, పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పోతార్లంక, భట్టిప్రోలు మండల పరిధిలోని పెదలంక, చింతమోటు, పెసర్లంక తదితర గ్రామాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని పంట భూములను ముంచెత్తింది. వాణిజ్య పంటలతో పాటు ఇటుక బట్టీలు కూడా ముంపునకు గురయ్యాయి. ఆవులవారిపాలెం, గాజుల్లంక రహదారిపైకి కూడా నీరు చేరింది. చినరేవులో నుంచి వరద దోనేపూడి వద్ద, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు చప్టాలపై నుంచి ప్రవహించడంతో రాకపోకలను అధికారులు నిలిపి వేశారు. భారీ వరదపై వదంతులు రావడంతో లంక గ్రామాలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఓలేరుపల్లెపాలెం, పెనుమూడిపల్లెపాలెం, మైనేనివారిపాలెం తదితర గ్రామాల్లోని ప్రజల కోసం ముందస్తుగా సమీపంలోని పాఠశాలలను పునరావస కేంద్రాలుగా ఉపయోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం కొల్లూరు మండలంలోని కిష్కిందపాలెం, కృష్ణనగర్, పోతార్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం, గ్రామాల్లో పర్యటించి వరద ఉధృతిని కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ పరిశీలించారు. వరద సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల సర్పంచ్‌లకు వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా తెలియజేస్తున్నామని, వారు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ట్రాక్టర్లను సిద్ధం చేసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. సోమవారం సాయంత్రానికి వరద తగ్గుముఖం పడుతుందని ఎవరు అధైర్యపడాల్సిన పనిలేదని గ్రామస్థులకు చెప్పారు. అధికారులంతా అందుబాటులో ఉంటారని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామలక్ష్మి, డీపీవో ప్రభాకరరావు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి
అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల: కృష్ణానదిలో నీటి ప్రవాహం రెండో లెవల్‌పైన ప్రహిస్తుంది కాబట్టి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ తెలిపారు. 25 పునరావాస కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రాలకు ఇన్‌చార్జిగా డీఆర్‌డీఏ పీడీ లవన్న ఉన్నారని తెలిపారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో విధులు కేటాయించిన అధికారులు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకుని వరద పరిస్థితులను అంచనా వేసి చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

తాడేపల్లి టౌన్: కృష్ణానదికి ఎగువ నుంచి భారీగా వరద పోటెత్తుతుండటంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఇన్‌ఫ్లో 6,50,389 క్యూసెక్కులకు చేరుకుంది. బ్యారేజ్‌లో పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు నిల్వ ఉండటంతో ఉదయమే రెండో ప్రమాద హెచ్చరికని జారీ చేశారు. బ్యారేజ్ గేట్లు అన్ని ఎత్తేసి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లోలో పెరుగుదల కనిపిస్తుండటంతో సోమవారం ఉదయం 8 గంటలకు 6.57 లక్షల క్యూసెక్కుల ప్రవాహం దాటొచ్చని ఇరిగేషన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



చినరేవు వల్ల ఇబ్బందులను కలెక్టర్‌కు వివరిస్తున్న పోతార్లంక గ్రామస్తులు



వరద నీటిలో కొల్లూరులోని ఇటుక బట్టీలు



అరవింద వారధి వద్ద ఉధృతంగా వరద ప్రవాహం



రేపల్లెమండలం కనగాలవారిపాలెంలో కరకట్టను ఇసుక బస్తాలతో పటిష్టపరుస్తున్న ఆర్‌సీఏఈ నాగేశ్వరరావునాయక్



కొల్లూరు : వరద ముంపునకు గురైన అరటి తోట

అవీ..ఇవీ..

నేడు, రేపు పురుషుల ఖోఖో సూపర్‌లీగ్ పోటీలు



సూపర్‌లీగ్ ఖోఖో పోటీలకు సిద్ధం చేసిన క్రీడాప్రాంగణం

పంగులూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరులో ఈ నెల 29, 30 తేదీలలో పురుషుల సూపర్‌లీగ్ ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక ఎంఎస్ఆర్అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల క్రీడాప్రాంగణంలో ఎస్.ఆర్.ఆర్.ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమి డైరక్టర్ ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. ఈ పోటీలలో మొత్తం ఆరు క్రీడాజట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. రాత్రి, పగలు పోటీలు నిర్వహించే విధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని సీతారామిరెడ్డి తెలిపారు. ఖోఖో పోటీల నిర్వహణకు మ్యాట్‌ల ఏర్పాటుతో పాటు రాత్రివేళ క్రీడల నిర్వహణకు అవసరమైన ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి జరిగే సూపర్‌లీగ్ ఖోఖో పోటీలను రాష్ట్ర ఖోఖో అసోషియేషన్ ఛైర్మన్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ బీసీ.హెచ్.గరటయ్య ప్రారంబిస్తారని తెలిపారు. మూడుదశాబ్దాలకు పైగా ఈ క్రీడాప్రాంగణంలో శిక్షణపొంది రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించిన అనేకమంది క్రీడాకారులు, పంగులూరు పరిసర గ్రామప్రజల సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు సీతారామిరెడ్డి తెలిపారు. సూపర్‌లీగ్ ఖోఖో పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

- అరకు కాఫీ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే
- జాతీయ స్థాయిలో కాఫీకు గుర్తింపు రావాలని ఆకాంక్ష



కాఫీ తాగుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సహజ సిద్ధమైన ఉత్పత్తులతో చక్కని ఆరోగ్యం ఉంటుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. ఆదివారం వాడరేవులో అరకు కాఫీ దుకాణాన్ని ఎమ్మెల్యే ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరకు కాఫీ ప్రాముఖ్యతను మరింత పెంచేందుకు కూటమి శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఎలాంటి రసాయనాలు లేని పదార్థాల వినియోగంపై ప్రజలు దృష్టి సారించాలని సూచించారు. టీ సేవించి అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం దేశాయిపేటలో సిల్క్‌బోర్డు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, డీపీఎంలు రవీంద్ర, సునిత, ఏపీఎంలు మధు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎత్తిపోతలు

- మరమ్మతులు చేయించాలంటున్న రైతులు
- సాగర్ నుంచి నీరు విడుదల చేయడంతో రైతుల్లో వరి సాగుపై ఆసక్తి

బల్లికురవ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు ఇప్పుడు గ్రామాలలో అలంకారప్రాయంగా మారాయి. కొన్నేళ్లగా స్వల్పమరమ్మతులతో పథకాలు పనిచేయకుండా నిరుపయోగంగా ఉన్నాయని ఇప్పటి వరకు అంటే సాగుకు నీరులేదని ఈ ఏడాది సాగర్ కాలువల ద్వారా పంటలకు ముందస్తుగా నీరు రావడంతో ఎత్తిపోతల పథకాలు పనిచేయకుంటే అయకట్టులో ఉన్న చివరి భూములకు సాగునీరు అందే పరిస్థితి లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

మండలంలోని గుంటుపల్లి, కొణిదెన, నక్కబొక్కల పాడు, ఉప్పుమాగులూరు గ్రామాలలో ప్రభుత్వ ఐడీసీ పథకం ద్వారా గతంలో ఎత్తిపోతల పథకాలను నిర్మించింది. ఈ ఎత్తిపోతల పథకాల ద్వారా వేల ఎకరాల్లో వరి, మెట్టపైర్లయిన మిర్చి, మొక్కజొన్న, జూటు, శనగ, పత్తి, పొగాకు పంటలు రైతులు గతంలో సాగు చేశారు. కొంతకాలం నుంచి ఎత్తిపోతల పథకాల గురించి ఎవరు పట్టించుకోలేదు. ఈ ఏడాది అన్ని డ్యాంలు పూర్తిస్థాయిలో నిండడంతో సాగుకు ప్రభుత్వం నీటివిడుదల చేస్తోంది. దీంతో రైతుల్లో మరలా వరిసాగును పెద్దఎత్తున సాగుచేసేలా రైతులు సిద్ధం అవుతున్నారు. కాని సాగర్ నీరు వచ్చిన ఎత్తిపోతల పథకాలు పనిచేయకుంటే పంటలు పండించడం కష్టం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటుపల్లి ఎత్తిపోతల పథకానికి 24 గంటల విద్యుత్ లైన్ మరమ్మతులకు గురైంది. ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధిపరిస్తే నాలుగు గ్రామాల్లోని రైతులకు పంటలకు ఎలాంటి డోకా ఉండదు. నక్కబొక్కలపాడు ఎత్తిపోతల పథకం కింద 1212 ఎకరాల అయకట్టు ఉంది. ఈ పథకానికి సంబందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగలగొట్టి తీగలను తస్కరించడంతో విద్యుత్ సరఫరా లేక ఈ పథకం కొన్నేళ్లగా నిరుపయెగంగా మారింది. ఈ పథకం ఏర్పా టుకు ప్రభుత్వం అప్పట్లో సుమారు ఏడు కోట్లను వెచ్చింది. ఇప్పుడు ఈ పథ కం రైతులకు అందని ద్రాక్షలా తయారయింది. అలానే ఉప్పుమాగులూరు గ్రామంలో ఉన్న వేణు గోపాలస్వామి ఎత్తిపోతల పథకం కింద 3300 ఎకరాల భూములకు సాగు నీరు అందాల్సి ఉంది. కాని ఈ పథకం ఇప్పుడు కనుమరుగయ్యే ప్రమాదంలో ఉంది. ఈ పథకం ద్వారా నాలుగు గ్రామాల రైతులకు పంటలకు నీరు అందే సౌకర్యం ఉంది. కాని గత కొంత కాలంగా మరమ్మతులకు గురైంది. గత ఏడాది దొంగలు విలువైన మోటార్లను కూడా దొంగించారు. పిచ్చి మొక్కలు నిండుకొని ఉండటంతో కొంతకాలం నుంచి ఈ పథకం పనిచేయడం లేదు. అలానే కొణిదెన గ్రామ ఎత్తిపోతల పథకానికి స్వల్ప మరమ్మతులు ఉన్నాయి. అని రైతులు అంటున్నారు. పైపులైన్ సరిగా లేదని రైతులు తెలిపారు. తక్షణమే అధికార్లు ఎత్తిపోతల పథకాలను వినియెగంలోకి తీసుకురావాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. లేకుంటే సాగర్ నీటి విడుదల జరిగిన ఎలాంటి ఉపయెగం ఉండదని వారు తెలిపారు. ఐడీసీ అధికారులు ఎత్తిపోతల పథకాలను ఇటీవల పరిశీలన చేసి నివేదికలు తయారు చేసిన ఇంతవరకు పథకాలను వినియెగంలోకి తీసుకు రాలేదని తక్షణమే అన్ని పథకాలు వినియోగంలోకి తీసుకొచ్చి ఎత్తిపోతల పథకాల వద్ద రాత్రులు వాచ్‌మెన్లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



అలంకారప్రాయంగా ఉన్న నక్కబొక్కలపాడు ఎత్తిపోతల పథకం





నిరుపయోగంగా ఉన్న ఉప్పుమాగులూరు ఎత్తిపోతల పథకం, శిథిలమైన ట్రాన్స్‌ఫార్మర్

భవిష్యత్తులో మరింత తగ్గనున్న విద్యుత్‌చార్జీలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఎక్కువ ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేసి ట్రూఅప్ చార్జీల పేరుతో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 15 నెలల పాటు కసరత్తు చేసి తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తూ వినియోగదారులపై భారం తగ్గించేందుకు ట్రూడౌన్ చార్జీలు ద్వారా బిల్లులు తగ్గిస్తోందన్నారు. అద్దంకి పట్టణంలో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాలలో పాల్గొన్న విద్యుత్ శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ చార్జీల భారమే ఇప్పటి వరకు వినియోగదారులు చెల్లిస్తున్నారన్నారు. అక్టోబర్ నెల నుండి ప్రతి యూనిట్‌కు 13 పైసలు చొప్పున విద్యుత్ చార్జీలు తగ్గుతాయన్నారు. రూ.926 కోట్ల భారం వినియోగదారులకు తగ్గుతాయన్నారు. తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నందున భవిష్యత్తులో విద్యుత్ బిల్లులు మరింత తగ్గుతాయన్నారు. ప్రతి ఒక్క కుటుంబం తమ ఇళ్లపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవటం ద్వారా విద్యుత్ బిల్లులు మరింత తగ్గుతాయన్నారు.

మంత్రి విశేష పూజలు

దసరా ఉత్సవాలలో బాగంగా అద్దంకి పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం లో విద్యుత్‌శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవాలయం కమిటీ, పూజారులు, ఆర్యవైశ్యులు మం త్రి రవికుమార్ కు స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం సత్కరించారు



పూజలు చేస్తున్న మంత్రి రవికుమార్

జార్లపాలెం వద్ద ముఖద్వారం ప్రారంభం



జార్లపాలెం వద్ద ప్రారంభించిన ముఖద్వారం

అద్దంకి, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జార్లపాలెం వద్ద ఎంఆర్ఎస్ సేవాసమితి ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో నిర్మించిన ముఖద్వారాన్ని ఆదివారం దాతలు చల్లా నాగార్జునరెడ్డి దంపతులు ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు. ముఖద్వారానికి పైభాగంలో రెండు వైపులా ఏర్పాటు చేసిన ఎడ్లబొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నేడు మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య శిబిరం

మార్టూరు, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): మార్టూరు లోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్లు మెడికల్ ఆఫీసర్ అశోక్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో చర్మవ్యాధులకు,చెవి ముక్కువ్యాధులకు,మానసిక సమస్యలకు తదితర వ్యాధులుకు ప్రముఖ వైద్యులు వస్తారన్నారు. వారు ఉచితంగా పరీక్షలు చేస్తారని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని అశోక్ రెడ్డి కోరారు.

ఘనంగా జాషువా జయంతి



నివాళులు అర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

విజయనగర్‌కాలనీ (చీరాల), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేశచరిత్రలో గుర్రం జాషు వా తొలి ఆధునిక పద్యకవి అని, కవిత్వం ద్వారా సామాజిక రుగ్మతలపై, అంటరానితనం, దురాచారా లపై గళమెత్తిన మహనీయులని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, బీఎస్పీ నాయకులు తేళ్ల వెంకట స్వాములు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతనం పలు రచనలను కొనియాడారు. కార్యక్రమంలో లక్ష్మీనరసయ్య, రవికుమార్, వందనం, ఏసుపాదం, ప్రజ్ఞా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్‌తో భరోసా

అద్దంకి, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అన్యాయం జరిగిన వైసీపీ కార్యకర్తలకు జగన్ ఇచ్చే భరోసా డిజిటల్‌బుక్ అని వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. కూటమిపాలనలో అ క్రమ కేసులు ఎదుర్కొంటున్న వైసీపీ కార్యకర్తలు వారికి జరిగిన అన్యాయాన్ని డిజిటల్ బుక్ లో పొందుపరచాలన్నారు. అద్దంకి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి పిడుగురాళ్ళ లో ఆదివారం జరిగిన కార్యక్రమం లో డాక్టర్ అశోక్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు జ్యోతి హనుమంతరావు,గుజ్జుల జగన్మోహనరెడ్డి, అవిశన ప్రభాకరరెడ్డి,మాకినేని శ్రీనివాసరావు,గునుపూడి రఘురామగుప్తా, ఇస్తర్ల వెంకటరావు,రాఘవరెడ్డి,భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



చినగంజాం పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్

చినగంజాం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : చినగంజాం పోలీసు స్టేషన్‌ని చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్ ఆదివారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో బాగంగా ఆయన పోలీసుస్టేషన్‌ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, నేరాల దర్యాప్తు పురోగతిని గురించి డీఎస్పీ సమీక్షించారు. పోలీసు సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. సిబ్బంది ఇబ్బందులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.ఐ శీలం రమేష్‌కు పలు సూచనలు అందజేశారు. ముందుగా ఆయన పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎస్.ఐలు జి.శ్రీనివాసరావు, విజయభాస్కరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

54 సవర్ల బంగారం చోరీపై కేసు నమోదు

మార్టూరు,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి):మండలంలోని వలపర్ల గ్రామంలో ఉపాధ్యాయులు కార్యంపూడి కొండలరావు ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు 54 సవరు (432 గ్రాములు) బంగారు ఆభరణాల అపహరణపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. వాటి విలువ రూ.21.60 లక్షల సొత్తు అపహరణకు గురైనట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. అందుకు సంబంధించి కొన్నిచోట్ల సీసీ పుటేజీలను, ఇంకా ఇతరత్రా దర్యాప్తును వేగవంతంగా చేస్తున్నామన్నారు. ఇప్పటికే క్లూస్ టీం బృందం దొంగతనం జరిగిన ఇంటిలో వేలిముద్రలను సేకరించిందన్నారు.ఇంటి పరిసరాలు, చుట్టుపక్కల వీదులు, వలపర్ల గ్రామానికి వెళ్లే రహదార్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు కొండలరావు ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైసీపీ నాయకులకు పరామర్శ

మార్టూరు,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని డేగరమూడి గ్రామంలో వైసీపీ పార్టీకి చెందిన ప్రమోద్ కుమార్,జ్యోతి పోతులూరి, సర్పంచ్ భాగ్యరావులను ఆదివారం సాయంత్రం రాష్ట్ర వైసీపీ నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, కొమ్మూరి కనకారావులు ఉన్నారు.

రాజధానిలో.. ఠీవీగా ఎన్టీఆర్

(5వ పేజీ తరువాయి)

నిర్మించిన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాజెక్టు కు సంబంధించిన అంశాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనరు కన్నబాబు, ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారధితో పాటు అధికారుల బృందం ఓమారు ఏక్తానగర్‌ను సందర్శించి వచ్చింది.

ప్రాజెక్టులో ప్రధానాంశాలివే

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న బేస్‌లో ఎన్టీఆర్ మెమోరియల్ హాలు, మ్యూజియం, ఎన్టీఆర్ జీవిత చరిత్రను తెలియజేసే కళాకృతులు, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్‌లను నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకోసం బేస్ పీఠభవనాన్ని జీ+3గా నిర్మించనున్నారు. అలాగే కొండ శిఖరంపై క్యాంటీన్, ప్రత్యేకాకర్షణగా ఫ్యూనిక్యులర్ రైల్వే, కొండపైన పార్కింగ్ ఏరియా, టిక్కెట్ కౌంటర్, కొండపైకి ఘాట్‌రోడ్డు, సర్వీసు భవనాలు, ఉద్యానవనాలు, ఫ్యాబ్రిక్ కప్ నిర్మాణాలతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనున్నది. కొండ దిగువన చేపట్టనున్న 450 ఎకరాల సరస్సును యాత్రికులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో జెట్టీ బోటింగ్ ఉంటుంది. చుట్టూ వాటర్ ఫ్రంట్‌గా ఉండే కొండ దిగువన స్టార్ హోటల్, షాపింగ్ సెంటర్లు, రిసార్టులను ఏర్పాటుచేయనున్నారు. అలాగే ఎన్టీఆర్ విగ్రహం లోపల లిఫ్టులు కూడా ఏర్పాటు చేస్తారు. మొత్తంగా ఈ ప్రాజెక్టు ఇంచుమించు 170 ఎకరాల్లో ఆవిష్కృతం కానుంది. ఎన్టీఆర్ విగ్రహంతో పాటుగా అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు విగ్రహాలను కూడా ఏర్పాటుచేసే అంశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్

అద్దంకి,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి):అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అధికారులు బాధ్యతగా వెంటనే పనిచేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం మంత్రి రవికుమార్ ప్రజల నుండి అర్జీలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజల నుంచి అర్జీలను పరిష్కరించేందుకు ఒక ఉద్యోగిని కేటాయించాలన్నారు.

అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు

పంగులూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఏడవరోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రేణంగివరంలోని త్రిశక్తి పీఠంలో ముప్పవరంలోని శ్రీలక్ష్మీగణపతిషిర్డీసాయి ఆలయంలో అమ్మవార్లను శ్రీమహాచండీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీమహాచండీదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకున్నభక్తులు ప్రత్యేక పూజలుచేశారు. పంగులూరులోని శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతిదేవి అమ్మవారిని, రామకూరులో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలోని శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవారిని, చందలూరు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. చందలూరులోని శ్రీగోవింద కళానిలయంలో, చిట్టాబత్తినవారి వంశదేవర రేణుకమ్మతల్లి ఆలయంలో,కొండమూరమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవిశరన్నవరాత్రి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో దసరా శరన్నవరాత్రి వేడుకలు ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం కొప్పెరపాడు బొడ్డురాయి కూడలిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలానే నక్కబొక్కలపాడు పోలేరమ్మ దేవాలయం, కొత్తపాలెం, మల్లాయపాలెం, వేమవరం, అంబడిపూడి, గుంటుపల్లి, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొమ్మినేనివారిపాలెం గ్రామాలలో దసరా నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భజనలు నిర్వహిస్తున్నారు.

అద్దంకి : దసరా ఉత్సవాలలో బాగంగా ఆదివారం అద్దంకి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. దత్తపాదుకా క్షేత్రంలో మహిళలు భగవద్గీత పారాయణం చేశారు. పోలేరమ్మ దేవాలయం, వేయిస్తంభాల గుడి తదితర దేవాలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆయా దేవాలయాలలో అమ్మవార్లను దర్శించుకున్నారు.

అద్దంకి : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అద్దంకి పట్టణంలోని వేయిస్తంభాల గుడిలో అమ్మవారిని ఆదివారం ధనలక్ష్మీ అలంకరణలో అలంకరించారు. రూ.6 లక్షల విలువైన రూ.500, రూ.200, రూ.100, రూ.50ల కరెన్సీ నోట్ల తో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు పూజారి శర్మ తెలిపారు. ధనలక్ష్మి అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

చినగంజాం : విజయదశమి పండుగను పురస్క రించుకొని దేవీమండపాలు, ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు వైభవంగా నిర్వహిస్తు న్నారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిరంలోని అమ్మవారిని ఆదివారం విజయలక్ష్మి అమ్మవారిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మందిరంలోని బతుకమ్మ అమ్మవారిని మహిళా భక్తులు ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమ పూజలు నిర్వహించారు. సోపిరాల గ్రామంలోని రామకోటేశ్వరస్వామి ఆలయంలోని లలితా పరమేశ్వరి అమ్మవారు, రైల్వేసెంటర్ భవానీ పురంలోని విజయకనకదుర్గాభవాని అమ్మవారిని మహా చండీదేవిగా కొలువుదీరిన అమ్మవార్లను భక్తులు విశేషంగా తరలివచ్చి దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పర్చూరు : దశరా శరన్నవరాత్రి వేడుకలను మండలంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా ప్రతి రోజు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు చేపడతున్నాను. కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని నాగులపాలెం గ్రామంలోని గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి ఆలయంలో మహాలక్ష్మీ అవతారంలో అమ్మవారిని అలంకరించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చందలూరి సునీల్ సార్మంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పర్చూరులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దశర శరన్నవరాత్రి ఉత్సవ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకుంటున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.







అద్దంకిలో దుర్గాదేవిగా కన్యకా పరమేశ్వరి అమ్మవారు, నాగులపాలెంలో మహాలక్ష్మి అలంకరణ, కొప్పెరపాడులో మహాచండీ అలంకరణ





చినగంజాం, పంగులూరులో అమ్మవారి అలంకరణలు







కాళీ అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

కాళీమాతకు జై...!

నెల్లూరు : కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తుల లలితా సహస్రనామ పారాయణ

జిల్లావ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఆదివారానికి ఏడవ రోజుకి చేరాయి. నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరీ ఆలయంలోని అమ్మవారు కాళికాదేవిగా దర్శనమిచ్చారు. స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ధనలక్ష్మిగా, నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే జొన్నవాడ కామాక్షితాయి, కావలి కలుగోళమ్మ, పెంచలకోన, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులను కటాక్షించారు. నగరంలోని ఇరుగాళమ్మ ఆలయంలో జరిగిన కుంకుమ పూజలో వేలాదిమంది మహిళలు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో లలితా సహస్రనామార్చన జరగ్గా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం నాటి పూజల్లో పాల్గొన్న భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి.

- నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)



నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

అందనంటున్న ఆసరా!

- 'ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం బాధితులకు కరువైన ప్రోత్సాహం
- శస్త్రచికిత్సల తర్వాత మందులు, ఖర్చులకు నగదు
- 11 నెలలుగా నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- జిల్లాలో రూ.10 కోట్లకుపైగా బకాయిలు



నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ వైద్యసేవలు పొందుతున్న వారికి నగదు ప్రోత్సాహం అందనంటోంది. నెట్‌వర్క్ ఆసుపత్రులలో శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు డిశ్చార్జ్ అయి న 24 గంటల్లో నగదు వారి బ్యాంకు ఖాతాలో జమవుతుంది. అలాంటిది గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటిదాకా ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలేదు. ఆరోగ్యశ్రీ కింద ఆసరా పథకాన్ని 2019, డిసెంబరు ఒకటో తేదీన అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. విశ్రాంతి సమయంలో వైద్య చికిత్స, మందులతోపాటు ఇతర ఆదాయ వనరుల కింద నెలకు సరాసరి రూ.5వేల వరకు ఆర్థికసాయం అందేది. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్టీఆర్ వైద్యసేవ పథకంగా పేరు మార్పు చేశారు. అయితే, గత వైసీపీ హయాంలో పేరుకుపోయిన ఆరోగ్యశ్రీ బకాయిలు ఇప్పటికి పూర్తిస్థాయిలో అందలేదు. జిల్లాలో రూ.100 కోట్ల బకాయిలు పేరుకున్న స్థితిలో ఆరోగ్యశ్రీ ఆసరా కింద ఆర్థిక ప్రోత్సాహం కూడా అందక పోవటం పట్ల వ్యాధిగ్రస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటా ఆసరా కింద చెల్లిస్తున్న మొత్తం		
సంవత్సరం	రోగులు	రూ.కోట్లలో
2021-22	33,863	16.94
2022-23	37,286	18.55
2023-24	39,888	20.39
2024-25	21,849	17.31
2025-26 (ఆగస్టు వరకు)	18,500	9.00

రూ.కోట్లలో బకాయిలు

ప్రతి ఏటా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు 24 వేలకుపైగా జరుగుతుంటాయి. కాళ్లు, చేతులు విరిగిన వారు 3 నెలలపాటు ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి వారికి నెలకు రూ.5వేలు చొప్పున 15వేలు ఆసరా పథకం ద్వారా అందిస్తున్నారు. అలాగే క్యాన్సర్ రోగులకు మెడికల్ మేనేజ్‌మెంట్ కింద 180 రోజులకు రూ.30 వేల వరకు చెల్లిస్తున్నారు. క్రిటికల్ చర్మ వ్యాధులకు సంబంధించి ఏడాదికి రూ.60వేలు ప్రభుత్వం అందించేది. అయితే, గతేడాది అక్టోబరు నుంచి ఆసరా పథకం కింద రోగులకు రూ.10 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. నిధులు విడుదల చేయక పోవటంతో రోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 132 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా ఇందులో 35 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు, 31 డెంటల్ ఆసుపత్రులు, 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆసుపత్రులు, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితో పాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. ఇందులో ఆరోగ్యశ్రీ కింద జరుగుతున్న రోగులకు ఆసరా అందని ద్రాక్షలా మారుతోంది. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని రోగులు కోరుతున్నారు.



నిధులు విడుదల కాలేదు!

ఆసరా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నిధులు విడుదల చేయలేదు. నిధులు విడుదల అయ్యాక వారి బ్యాంకు అకౌంట్లలో నగదు జమచేస్తాం. ఇప్పటి వరకు 11 నెలల్లో రావాల్సిన బకాయిలు రోగులకు అందించాల్సి ఉంది. రోగుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం త్వరలోనే నిధులు విడుదల చేస్తుంది.

- డాక్టర్ సుధీర్‌కుమార్, ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్

నేటి నుంచి రెండో విడత బీఈడీ కౌన్సెలింగ్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో కన్వీనర్ కోటాలో ప్రవేశం పొందేందుకు ఈనెల 29 (నేటి) నుంచి రెండోవిడత కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీ. లక్ష్మీప్రసన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 3 వరకు రెండోవిడత వెబ్ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్, ఈనెల 30 నుంచి అక్టోబరు 4 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, అక్టోబరు 5 నుంచి 7 వరకు వెబ్‌ఆప్షన్ ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 8న వెబ్ ఆప్షన్ మార్పు చేసుకునే అవకాశం కల్పించి, 10న సీట్లు ఖరారు చేస్తామని తెలిపారు. సీట్లు ఖరారైన విద్యార్థులు 13న సెల్ఫ్ జాయినింగ్ రిపోర్ట్ ద్వారా కళాశాలలో ప్రవేశం పొందాలన్నారు. తొలివిడతలో 64 మందికి ప్రవేశం లభించిందని, రెండో విడతలో మరో 36 మందికి అవకాశం కల్పిస్తున్నామని ఆమె వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు ఎడ్‌సెట్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

వాహనమిత్ర

జాబితా తుది దశకు..

- కొనసాగుతున్న గ్రీవెన్స్‌ల పరిశీలన
- 4న లబ్ధిదారుల ఖాతాల్లో నగదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు లబ్ధి చేకూర్చేలా అమలులోకి తీసుకువచ్చిన వాహన మిత్ర పథకం లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది. దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగిసినా, తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి సచివాలయాల ద్వారా వస్తున్న గ్రీవెన్స్‌లను రవాణాశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. వారిలో అర్హులైన వారిని జాబితాలో చేరుస్తున్నారు. ఇప్పటివరకు 19,530 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. కాగా అక్టోబరు 4న లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.15 వేల నగదు జమ చేయనున్నది.

ధాన్యం దాచి దోపిడీ

- రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు
- భారీగా నిల్వ చేస్తున్న దళారులు
- అదును చూసి అధిక ధరలకు విక్రయం

అక్కరుకురాని కొనుగోలు కేంద్రాలు

నెల్లూరురూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎడగారులో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. అన్నదాతల వద్ద తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారులు భారీగా నిల్వ చేస్తూ, అదును చూసి అధిక ధరలకు విక్రయించేందుకు సిద్ధపడుతున్నారు. వరికోతల సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు అక్కరకు రావడం లేదు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా దళారులు దాచిన ధాన్యమే దర్శనమిస్తున్నది.

తక్కువ ధరకు కొనుగోళ్లు

సుమారు 120 రోజుల కాలపరిమితిలో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిబంధనల మేరకు పుట్టి రూ. 19,720లకు తగ్గకుండా కొనుగోలు చేయాలి. కానీ గ్రామాల్లో దళారులు పుట్టి రూ. 1500 నుంచి 15,500లకు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం దాచుకునేందుకు వీలు లేక, ప్రభుత్వానికి అమ్ముకునేందుకు కేంద్రాలు లేక రైతులు దళారులకు తెగనమ్ముకుంటున్నారు. ఇలా సేకరించిన ధాన్యాన్ని వారు భారీగా నిల్వ చేస్తున్నారు. గోదాములు అవకాశం ఉన్న వారు అక్కడకి, ఏ అవకాశం లేనివారు ఖాళీ స్థలాల్లో నట్టు వేసి పట్టలు కప్పేస్తున్నారు. ఇలా గ్రామాల్లో భారీగా ధాన్యం నిల్వలు దర్శనమిస్తున్నాయి. కాగా అదును చూసి ధాన్యం ధరలు పెరిగినప్పుడు దళారులు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు దోపిడీకి గురవుతున్నారు.

అక్కరుకు రాని కొనుగోలు కేంద్రాలు

వరి కోతలు ప్రారంభం సమయంలోనే అధికారులు గ్రామాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కానీ ఎడగారులో ఈ కేంద్రాలను ఇప్పటి వరకు ప్రారంభించలేదు. సోమ, మంగళవారాల్లో (నేడో, రేపో) ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్తున్నారు. గత నెల రోజులుగా వరి కోతకు వచ్చి, ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నెల్లూరురూరల్లోని తూర్పు, పడమర పల్లెల్లో దాదాపుగా 80 శాతం వరికోతలు పూర్తయ్యాయి. చివర ఆయకట్టు 20శాతం మాత్రమే మిగిలి ఉంది. ధాన్యం అమ్మకపు సమయంలో అక్కరుకు రాని కొనుగోలు కేంద్రాలు సీజన్ పూర్తయ్యాక ఇప్పుడెందుకు...? అంటూ రైతులు అధికారులపై గుర్రుమంటున్నారు.

చివరి వినియోగదారుడి వరకు

జీఎస్టీ ఫలాలు అందాలి

- ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబరు 1915
- 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 ఫలాలు చివరి వినియోగదారుడికి వరకు అందించడం మనందరి బాధ్యతని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. ఆదివారం నగరంలోని లలితా కన్వెన్షన్ సెంటర్‌లో నెల్లూరు చార్టెడ్ అకౌంటెంట్లు, ట్యాక్స్ బార్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0...సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులు, ఆడిటర్లు, అధికారులు, ట్రేడ్ యూనియన్ల నాయకులు అంతా కలిసి సమన్వయంతో జీఎస్టీ ఫలాలు ప్రజలకు చేరువ చేయాలన్నారు. గతంలో నాలుగు రకాలుగా ఉన్న పన్ను విధానాన్ని, ప్రస్తుతం రెండు రకాలకే పరిమితం చేశారని చెప్పారు. దీంతో 90 శాతం మంది ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందని, అన్నీ వస్తువుల ధరలు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. వస్తు సేవలకు సంబంధించి క్రయ,విక్రయాలపై వినియోగదారుల ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబరు 1915కి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం వ్యాపారులు, చార్టెడ్ అకౌంటెంట్లు, వాణిజ్య పన్నులశాఖ అధికారులతో కలిసి సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కరపత్రాలను దినకర్ ఆవిష్కరించారు.



నగరంలోని డీ మార్టులో జీఎస్టీ తగ్గిందా..లేదా అని వినియోగదారుని అడిగి తెలుసుకుంటున్న లంకా దినకర్

అమలు తీరు పరిశీలన

నగరంలోని డీమార్టు, హీరో హోండా, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లను దినకర్ తనిఖీ చేశారు. జీఎస్టీ తగ్గింది కదా.. ? తగ్గిన ధరకే వస్తువులు ఇస్తున్నారా...? ఏం సార్ బైక్‌ల ధరలు తగ్గాయి కదా...? తగ్గిన ధరలకే ఇస్తున్నారా...? ఇన్సూరెన్స్‌లపై జీఎస్టీ లేదు. ఈ సమాచారం మీకు తెలుసా..? అని వినియోగదారులను ఆయన అడిగారు. ఈ కార్యక్రమాల్లో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ సత్యప్రకాష్, బీజేపీ నేత కందుకూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు 11,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి ఆదివారం 11,560 క్యూసెక్కులు వస్తుండగా, 72.493 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టన్నల్ ద్వారా డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 150, కండలేరుకు వరద కాలువ ద్వారా 9000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎకరాకు 3 బస్తాలే !

- యూరియా పంపిణీకి ప్రణాళిక
- ప్రతీ రైతుకు ప్రత్యేక కార్డు
- అమ్మినవారి ముద్ర, సంతకం తప్పనిసరి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతను అధిగమించేందుకు కలెక్టర్ హిమాన్స్ శుక్లా ఆదేశానుసారం వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది. జిల్లాలో అధిక శాతం రైతులు వరి సాగుకే ప్రాధాన్యమిస్తారు. ఎకరా వరిసాగుకు సుమారుగా 135 కేజీల యూరియాను మాత్రమే వ్యవసాయశాఖ సిఫార్సు చేస్తుంది. ఈలెక్కన 45 కేజీల బస్తా లు మూడు మాత్రమే అవసరం. అయితే రైతులు మాత్రం సరాసరి ఐదు బస్తా లు వినియోగిస్తున్నారు. అంతకుమిం చి వినియోగించే రైతులు కూడా ఉన్నా రు. దీంతో వ్యవసాయ శాఖ అంచనాలు తప్పుతున్నాయి. యూరియా కోసం రైతు లు సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, డీలర్ల వద్ద క్యూ కడుతున్నారు. రైతుల అవసరాన్ని గుర్తిస్తున్న డీలర్లు కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారు.



ప్రతి రైతుకు ప్రత్యేక కార్డు

రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని డీలర్లు అధిక ధరలకు యూరియా అమ్ముకోవడం, యూరియాతోపాటు అనవసరమైన పురుగు మందులు, ఇతర ఎరువులు కూడా అంటగడుతున్నారు. అంతేకాక ఈ-పాస్‌లో వేలిముద్రలు తీసుకోకుండానే విక్రయాలు జరుపుతున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఈవిషయాలను అధికారులు గుర్తించారు. వీటిని అరికట్టేందుకు ప్రతి రైతుకు ప్రత్యేక కార్డు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ-క్రాప్ నమోదు చేయించుకునే ప్రతి రైతుకు ప్రత్యేక కార్డు ఇవ్వనున్నారు. యూరియా అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, 1బీ అడంగల్ ఇలా అవసరమైన పత్రాలతోపాటు ప్రత్యేకకార్డు తీసుకెళ్లాల్సి ఉంటుంది. సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, డీలర్లు ఎవరి వద్ద కొనుగోలు చేసినా ఆయా దుకాణాల ముద్ర, సంతకం, ఎన్ని బస్తాలు తీసుకొన్నది, తేదీ తప్పని సరిగా నమోదు చేయాల్సి ఉంది. దీంతో యూరియా కొరతను అధిగమించవచ్చని అధికారులు భావిస్తున్నారు.




రైతులకు ఇవ్వనున్న ప్రత్యేక కార్డు

మూడు విడతలుగా పంపిణీ

వ్యవసాయశాఖ సిఫార్సు చేసిన మేరకు రైతులకు మూడు విడతలుగా యూరియాను అందించే ఆలోచనలో అధికారులు ఉన్నారు. యూరియా అవసరమైన సమయంలో 10 రోజుల వ్యవధిలో మూడు విడతలుగా అంటే ఎకరాకి మూడు బస్తాలు ఇవ్వాలని భావిస్తున్నారు. అయితే చిన్న, సన్నకారు రైతులకు మాత్రం ఒకే విడతలో అందించే అవకాశం కూడా ఉంది.

ఈ-క్రాప్ నమోదు ఆధారంగానే..



జిల్లా అవసరాలకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచుతున్నా... ఎక్కడో ఒక చోట సమస్య ఉంటోంది. సిఫార్సు చేసిన దానికంటే అధికంగా యూరియాను వాడకం కూడా సమస్యకు కారణమవుతోంది. దీన్ని అధిగమించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టాం. ఈ-క్రాప్ నమోదు ఆధారంగా ప్రతి రైతుకు ప్రత్యేక కార్డును ఇవ్వనున్నాం. ఈకార్డు ఉన్న రైతుకు మాత్రమే యూరియా పంపిణీ జరుగుతుంది. ఎకరాకు మూడు బ్యాగులు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించాం. ఒకే సారి కాకుం డా మూడు విడతలుగా ఇచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10,902
వెండి కిలో ధర	రూ. 1,47,500
వెండి ఒక గ్రాము	రూ.150.50

చేతిపంపునకు మరమ్మతులు

అనంతసాగరం సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బద్వేల్ రోడ్డు కూడలి వద్ద ఉన్న చేతిపంపు తుప్పుపట్టి అధ్వానంగా ఉండడంతో ఇటీవల తప్పుపట్టిన చేతిపంపు అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం అయింది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించి తప్పుపట్టిన పరికరాలు మార్చి కొత్త వస్తువులు బిగించారు. చేతిపంపు వినియోగంలోకి రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి సత్కారం



ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు, రైల్వే విశ్రాంత ఉద్యోగులు

కావలి, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు, బిట్రగుంట రైల్వే అభివృద్ధి ఆవశ్యకత గురించి అసెంబ్లీలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గళం వినిపించడం అభినంద నీయమని టీడీపీ నేతలు, రైల్వే విశ్రాంత ఉద్యోగులు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం బోగోలు మండల టీడీపీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు, విశ్రాంత రైల్వే ఉద్యోగులు ఎమ్మెల్యేని సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు.

రేపటి నుంచి యూరియా పంపిణీ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాళెం సహకార సంఘానికి 18 టన్నులు (400 బస్తాలు) యూరియా మంజూరైందని మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుంచి దుత్తలూరులోని సొసైటీ గోదాము నుంచి రైతులకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పంట సాగు చేసిన రైతులు 1బీ, ఆధార్‌కార్డుతో వస్తే బస్తా రూ266.50 చొప్పున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓవీ రోడ్డులో జరుగుతున్న వైండింగ్ పనుల్లో భాగంగా 11 కేవీ సిటీఆర్‌ఐ ఫీడర్ నుంచి సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరధిలోని సంతోష్‌నగర్, సబ్‌కలెక్టర్ కార్యాలయం, మోర్ సూపర్‌మార్కెట్, వాణీనగర్, రమణారెడ్డి పెట్రోల్ బంక్ ఏరియా, వాసవీ నగర్, ప్రకాశం కాలనీ, రెవెన్యూ కాలనీ, సీటీఐర్ ఏరియాల్లో వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కందుకూరు : వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి దంపతులు



బిట్రగుంట: మహాచండీదేవి అలంకరణలో రాజరాజేశ్వరీ దేవి



కావలి రూరల్ : చండీశ్వరీదేవి అలంకారంలో దుర్గా భ్రమరాంబ అమ్మవారు

కందుకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా కందుకూరులోని పెద్ద బజారులోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కందుకూరు శాసన సభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులు ఆదివారం వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాజాస్వామి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటూరి దంపతులు వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు నిర్వహించిన లలితా సహస్రనామ పారాయణంలో పాల్గొన్న సౌజన్యకు అమ్మవారి పసుపు, కుంకుమ అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి సుధీర్‌కుమార్, చక్కా వెంకట కేశవరావు, కాకుమాని ప్రవీణ్‌కుమార్, కోటా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

● **కావలి రూరల్:** కావలి పట్టణంలోని కలుగోళ శాంభవి అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి అలంకరణలో దర్శనమిచ్చారు. శేష వాహన సేవలందు కున్నారు. విష్ణు ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు సంతానలక్ష్మి అలంకరణలో పూజలం దుకున్నారు. శివాలయంలో దుర్గా భ్రమరాంబ అమ్మవారు చండీశ్వరీదేవి అలంకరణలో, కొత్తబజారు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాచండీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వడ్డిపాలెంలోని కనకదుర్గ అమ్మవారు కాత్యాయినీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా పువ్వులు, విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బృందావన కాలనీలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవతా మూర్తులకు మోహినీ పల్లకీ ఉత్సవం, లక్ష్మీకాసుల మాల, గరుడ వాహన ఉత్సవాలు నిర్వహించారు.

● **అల్లూరు :** పట్టణ పరిధిలోని శక్తి ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కలుగోళమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లు పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల నుండి అమ్మణ్ణులు పల్లకి సేవలు అందుకున్నారు. మహిళా భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● **బిట్రగుంట :** బోగోలు మండలంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. విశ్వనాథరావుపేట కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బోగోలు షిర్డీ సాయిబాబా మందిరం, రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామ లింగేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్థల వివాదం పరిష్కరిస్తా : ఎమ్మెల్యే ఇంటూరి



ఎమ్మెల్యే ఇంటూరితో చర్చిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జర్నలిస్టులు

కందుకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో జర్నలిస్టు కే హరిబాబు స్థలాన్ని కొందరు కబ్జా చేసిన వ్యహారంపై విచారించి తగు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సమస్యపై ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు కందుకూరు జర్నలిస్టులతో కలిసి ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు గతంలో జర్నలిస్టులకు నివాస స్థలాలు ఇచ్చారని, ఇది చట్టబద్ధంగా విలేకరికి లభించిన స్థలం అని, దీనిని కొందరు వివాదాస్పదం చేయడం సరికాదన్నారు. స్థానికులు దీనిపై రకరకాల ప్రచారాలు చేస్తున్నారని, వాస్తవాలు విచారించుకోవాలని ఎమ్మెల్యేకి సూచించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు ఎవరిపై వ్యక్తిగత ద్వేషం లేదని, ఖచ్చితంగా జర్నలిస్టులకు న్యాయం చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

రైతు పక్షపాతి ఎమ్మెల్యే దగుమాటి



మాట్లాడుతున్న మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి రైతు పక్షపాతి అని, రైతుల సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించేలా కృషి చేశారని నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ వేంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బోగోలు మండలం చెంచులక్ష్మీపురం పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు ఎం నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బాటలో నడుస్తూ కావలి ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాగులవరం పీఏసీఎసస్ డైరెక్టర్లు ఎల్ మాధవరావు, వీ సుధాకర్, టీడీపీ నేతలు కే వెంకటేశ్వరరెడ్డి, జీ నాగరాజు, మాకాఅర్జున్‌రాజ్, పీ వెంకటస్వామి, పీ సుబ్బారావు, పీ శీనయ్య, సీఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ వ్యాధి టీకా వేయించాలి : ఏడీ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెంపుడు, వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి టీకా తప్పనిసరిగా వేయించాలని ఏడి చెన్నకేశవులు సూచించారు. వలేటివారిపాలెం ప్రాంతీయ పశువైద్యశాలలో ప్రపంచ రేబిస్ వ్యాధి నివారణ దినోత్సవం సదర్భంగా ఆదివారం పెంపుడు కుక్కలకు టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడి చెన్నకేశవులు మాట్లాడుతూ రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి అని, ఇది కుక్కల నుండి మనుషులకు సంక్రమిస్తుందని, వ్యాధి రాకుండా ముందుగా టీకాలు వేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోకూరు పశువైద్యాధికారి సుదర్శన్ సుధాకర్, సిబ్బంది కొండారెడ్డి, కిరణ్‌కుమార్, శరత్, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి



ఆత్మకూరు: గుర్రం జాషువా, భగత్‌సింగ్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న తెలుగు భారతి సేవా సమితి నిర్వాహకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయం ప్రాంగణంలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవా సమితి అధ్యక్షుడు ఎస్ సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డి, గౌరవాధ్యక్షుడు అంకినపల్లి గోవిందరెడ్డి, సహాధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు కెవి శేషారెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, ఆర్థిక కార్యదర్శి ఒమ్మిన సుబ్రహ్మణ్యం ఉపాధ్యక్షులు రామయ్యస్వామి, ఓంకారం శ్రీనివాస రాజు, ప్రచార కార్యదర్శి కలిశెట్టి రవీంద్ర కుమార్, ఎస్‌వి రమణయ్య సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **కావలి :** మహాకవి గుర్రం జాషువా జయంతి సభ ఆదివారం స్థానిక వెంగళరావునగర్‌లోని విశ్వశాంతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో ఘనంగా జరిగింది. తెలుగు ధ్యానపీఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఠం అధ్యక్షుడు డాక్టర్ జిల్లా శ్రీనివాసులు, లోక్ అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి, కరస్పాం డెంట్ రమణయ్య, రోటరీక్లబ్ సభ్యుడు మల్లికార్జున, సామాజిక కార్యకర్త మురళి తదితరులు జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సాహితీ సేవలను స్మరించుకున్నారు.

లింగసముద్రం : సమాజంలోని అసమానతలు, వివక్షతలకు, దోపిడీకి వ్యతిరేకంగా రచనలు సాగించిన యోధుడు, మహాకవి, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని మాజీ సర్పంచు, మంచుపొగ రచయిత ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం గుర్రం జాషువా జయంతి సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పి బాలకోటయ్య, సర్పంచు పులి పెద రాఘవులు, తెలుగు పండిట్ మార్తాటి మాల్యాద్రి, కె కోటేశ్వరరావు, హార్మోనిస్టు దేవకి హరనాద్‌బాబు, షేక్ బాషా, ఎంపీటీసీ డి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

41 మద్యం సీసాల స్వాధీనం

ఉలవపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దిపూడి గ్రామం వడ్డెరపాలెంకు చెందిన తన్నీరు రాంబాబు అక్రమంగా మద్యం అమ్ముతూ ఆదివారం పట్టుబడినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. అందిన సమాచారం మేరకు రాంబాబు ఇంటికి వెళ్లి పరిసరాలను సోదా చేయగా గోనెసంచిలో 41 మద్యం సీసాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా

వింజమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ, మిగతా ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలియజేశారు.

కనుల పండువగా అమ్మవారి అలంకారాలు



ఆత్మకూరు: అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామికి పూజలు చేస్తున్నఅర్చకులు



సంగం: చండీదేవి అలంకారంలో కామాక్షిదేవి



ఉదయగిరి : మహాచండీ అలంకరణలో పార్వతీదేవి

ఆత్మకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాలలో అమ్మవారు వివిధ అలంకారాలలో భక్తులకు కనువిందు చేస్తున్నారు. పట్టణంలోని అన్నపూర్ణదేవి సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



తూర్పురొంపిదొడ్లలో కాళరాత్రి అలంకరణలో మానసాదేవి

● **సంగం:** స్థానిక సంగమేశ్వరాలయంలో అమ్మవారు ఆదివారం చండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు.

● **ఉదయగిరి:** పట్టణంలోని పార్వతీపరమేశ్వర, బాలాజీ నగర్, సంతానలక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు భక్తులకు మహాచండీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వరికుంటపాడులోని నాగరప్పమ్మ అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, సహస్రదీపాలంకరణ, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

● **సీతారామపురం:** మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, గ్రామ దేవత అంకాలమ్మ గుడి, నారాయణమ్మపేటలో విజయకనక దుర్గాదేవి ఆలయాలలో, ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు ఆదివారం దర్శనం ఇచ్చారు. అంకాలమ్మగుడి వద్ద రామిశెట్టి వెంకటయ్య, రమణమ్మ దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



సీతారామపురం: గాయత్రిదేవి అలంకారంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవి

ఘనంగా చెన్నకేశవస్వామి గ్రామోత్సవం



స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురంలో ఆదివారం లక్ష్మీ చెన్నకేశవస్వామి కొణతాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మేడసాని వంశస్థుల ఆధ్వర్యంలో కోయిలంపాడు, గడ్డంవారిపల్లి చెన్నకేశవ స్వామి కొణతాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే గంగాభవానీకి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. పోతురాజుకు బోనం సమర్పించిన ఆచారవంతులు సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

సంగం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరి: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో గ్రామదేవత పోలేరమ్మకు ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగళ్ల సామగ్రిని నూతన బుట్టల్లో ఉంచుకుని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంతోపాటు కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం పాడిపంటలతో సమృద్ధిగా ఉండాలని ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఎమ్మెల్యే కాకర్ల చొరవతో శ్మశానానికి రోడ్డు సౌకర్యం



సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవంలో కూటమి నాయకులు

సీతారామపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జనసేన పార్టీ నా సేన కోసం నావంతు రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావుల చొరవతో మండల కేంద్రంలోని రంగుబావి వద్ద నుంచి ముస్లింల శ్మశాన వాటిక వరకు నూతన సిమెంట్ రోడ్డును మంజూరు చేయడం జరిగిందని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ తెలిపారు. ఆదివారం మండల కూటమి నాయకులు నూతన సిమెంట్ రోడ్డు, బ్రిడ్జి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా మండల ముస్లిం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి శ్మశాన వాటికకు, రైతులు పొలాల్లోకి వెళ్ళుటకు దారిలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఎంతమంది రాజకీయ నాయకులకు తమ సమస్య చెప్పినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇటీవల ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జనసేన నాయకుడు భోగినేని కాశీరావు దృష్టికి తీసుకెళ్లగా వారి చొరవతో నూతన సిమెంట్ రోడ్డు, బ్రిడ్జి మంజూరుచేసి, వేయించడం ఎంతో సంతోషంగా ఉందని, వారికి ముస్లింల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకుడు భోగినేని కాశీరత్తయ్య (గాంధీ), మండల ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, షేక్ పెద గౌస్, టిడిపి గ్రామ అధ్యక్షుడు దేవర వెంకటేశ్వర్లు, జయరాములు, వెంగళశెట్టి వెంకట్రావ్, తమ్మిశెట్టి రమణయ్య, తోట ఏడుకొండలు, పాల్గొన్నారు.